విలేఖరులు కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాదాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394 సంప్రదించగలరు
ఎడిటర్ చల్లా శ్రీకాంత్


# రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 10 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | 20 శనివారం ఏప్రియల్ 2024 | పేజీలు : 8 | వెల :రూ 2-00
GUNTUR | VOL-01 | ISSUE -10 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 20 SATURDAY APRIL 2024 | PAGES : 8 | Rs :2-00


## రష్యన్ బాంబర్ కూల్చివేత.. యుద్ధంలో ఇదే తొలిసారి..: ఉక్రెయిన్

కీవ్: భారీస్థాయి దాడులతో ఉక్రెయిన్ పై రష్యా కొంతకాలంగా దూకుడు పెంచింది. మరోవైపు ఆయుధాల కొరతతో కీవ్ సతమతమవుతోంది. ఈ పరిణామాల నడుమ ఉక్రెయిన్ కీలక ప్రకటన చేసింది. సైనిక చర్య మొదలైన తర్వాత మొట్టమొదటిసారి శత్రుదేశానికి చెందిన ఓ దీర్ఘశ్రేణి వ్యూహాత్మక బాంబర్‌ను కూల్చివేసినట్లు వెల్లడించిందని ఓ వార్తా సంస్థ తెలిపింది. పుతిన్ ప్రభుత్వం మాత్రం దీన్ని ఖండించింది. సాంకేతికలోపం కారణంగానే అది స్టావ్రోపోల్‌లోని నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయిందని తెలిపింది. ''గగనతల నిఘా వ్యవస్థ సహకారంతో యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణులు.. మాస్కోకు చెందిన 'టీయూ-22ఎం3' దీర్ఘశ్రేణి వ్యూహాత్మక బాంబర్‌ను కూల్చేశాయి. దీని సాయంతో ఆ దేశం గతంలో మా నగరాలపై 'కేహెచ్-22' క్షిపణుల వర్షం కురిపించి ంది'' అని ఉక్రెయిన్ సైన్యం తెలిపింది. దీనికి సంబంధించిన ఓ వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మరోవైపు.. కూలిపోయిన ఆ బాంబర్‌లోని నలుగురు సిబ్బందిలో ముగ్గురిని కాపాడినట్లు రష్యా రక్షణశాఖ తెలిపింది. మరొకరి కోసం అన్వేషణ కొనసాగుతున్నట్లు చెప్పింది. అయితే.. ప్రాణాలతో బయటపడిన వారిలో ఒకరు మృతి చెందినట్లు స్టావ్రోపోల్ గవర్నర్ చెప్పారు. ఉక్రెయిన్‌తో పోలిస్తే రష్యా వాయుసేన శక్తిమంతమైనది. అయితే.. పాశ్చాత్య దేశాలు సమకూరుస్తోన్న క్షిపణి వ్యవస్థలతో కీవ్ సవాల్ విసురుతోంది. గతంలో అనేక సందర్భాల్లో ఆ దేశ యుద్ధ విమానాలను కూల్చేసింది. జనవరిలో యుద్ధఖైదీలను తరలిస్తోన్న రష్యా సైనిక రవాణా విమానాన్నీ కూల్చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలాఉండగా.. మాస్కో తాజా దాడుల్లో నిప్రో ప్రాంతంలో ఎనిమిదేళ్ల చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. రష్యా 22 క్షిపణులు, 14 డ్రోన్లను ప్రయోగించగా.. 15 క్షిపణులు, అన్ని డ్రోన్లను కూల్చేసినట్లు కీవ్ వెల్లడించింది.



## హిందూపురంలో నామినేషన్ వేసిన నందమూరి బాలకృష్ణ



హిందూపురం: తెదేపా అభ్యర్థిగా నందమూరి బాలకృష్ణ మూడోసారి నామినేషన్ వేశారు. తన సతీమణి వసుంధరతో కలిసి హిందూపురం ఆర్వో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. హిందూపురంలో ఇప్పటికే వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలయ్య.. ఈ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నామినేషన్‌కు భారీగా తెదేపా, జనసేన, భాజపా కార్యకర్తలు తరలివచ్చారు. హిందూపురం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని బాలకృష్ణ అన్నారు. నామినేషన్ వేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్తున్నామని చెప్పారు. హిందూపురం ప్రజలు తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. తమ కుటుంబమంటే ఇక్కడి వారికి ఎంతో అభిమానమని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. అన్న క్యాంటీన్లను వైకాపా ప్రభుత్వం తొలగించినా హిందూపురంలో రోజుకి 400మందికిభోజనాలుఏర్పాటు చేశామన్నారు.

## 'ఉగ్రవాదులను' పంపించే దేశం.. 'పిండి' కోసం పాట్లు పడుతోంది - మోదీ



భోపాల్: ప్రస్తుతం కొనసాగుతోన్న లోక్‌సభ ఎన్నికలు వచ్చే ఐదేళ్లలో భారత్‌ను ప్రపంచ శక్తిగా మారుస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే బలమైన, స్థిర ప్రభుత్వం అవసరమని ఉద్ఘాటించారు. మధ్యప్రదేశ్‌లోని దమోహ్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్, దేశ రక్షణ వ్యవస్థను బలహీనపరిచిందని ఆరోపించారు. 'రక్షణ రంగంలో దేశం స్వావలంబన కోసం భాజపా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఎన్నో దేశాలకు ఆయుధాలను భారత్ సరఫరా చేస్తోంది. ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణలు ఎగుమతి చేస్తోంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాకిస్థాన్‌ను ఉద్దేశిస్తూ మాట్లాడిన ఆయన.. ఉగ్రవాదులను సరఫరా చేసే పొరుగుదేశం, నేడు పిండి కోసం పాట్లు పడుతోందని విమర్శించారు. ఫ్రాన్స్ తయారుచేసిన రఫేల్ యుద్ధ విమానాలు భారత్‌కు రావడం విపక్ష పార్టీకి ఇష్టం లేదని కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఈ క్రమంలోనే పేదలకు ఉచితంగా రేషన్ అందించే కార్యక్రమాన్ని మరో ఐదేళ్లు పొడిగించామన్నారు. దీనిద్వారా దాదాపు 80 కోట్ల మంది లబ్ధి పొందుతారని అన్నారు. రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసులో కక్షిదారుగా ఉన్న ఇక్బాల్ అన్సారీపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఆహ్వానాన్ని ఆయన అంగీకరించడం గొప్ప విషయమన్నారు. అదే కాంగ్రెస్ పార్టీ ఆ కార్యక్రమానికి దూరంగా ఉండటంపై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు.

## చంద్రబాబు తరపున నామినేషన్ వేసిన నారా భువనేశ్వరి



కుప్పం పట్టణం: తెదేపా అధినేత చంద్రబాబు తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామినేషన్ వేశారు. కుప్పంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో)కి నామినేషన్ పత్రాలను ఆమె సమర్పించారు. అంతకుముందు భారీ ర్యాలీగా ఆర్వో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తెదేపా, జనసేన, భాజపా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన ర్యాలీలో కార్యకర్తలను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడుతూ వైకాపా పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. ''రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. ఆయన హయాంలో పెట్టుబడులకు చాలా మంది ముందుకొచ్చారు. ఇవాళ పరిశ్రమలు రాకపోగా.. ఉన్నవి పోయాయి. కులమతాలు వేరైనా మనమంతా ఆంధ్రులం. వైకాపా పాలనలో తెదేపా కార్యకర్తలను తీవ్రంగా వేధించారు. రాక్షస పాలన నుంచి ప్రజలు విముక్తి కోరుకుంటున్నారు. ఓటు అనే ఆయుధంతో రాక్షస పాలనను అంతం చేయాలి. అందరం కలిసి ప్రజల ప్రభుత్వాన్ని తీసుకొద్దాం'' అని భువనేశ్వరి పిలుపునిచ్చారు.

## పవన్‌కు షాక్..జనసేనకు మరో నేత గుబ్ బై..!



అమరావతి: సార్వత్రిక ఎన్నికల ముందు జనసేన పార్టీకి మరో షాక్ తగిలింది. జనసేనకు చెందిన కీలక నేత పార్టీకి రాజీనామా చేశారు. నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ జనసేనకు రాజీనామా చేసి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. వ్యక్తిగత కారణాల వల్ల జనసేన పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్ష పదవికి, జనసేన పార్టీ సభ్యత్వంతో పాటు నాకు కేటాయించిన అన్ని పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాను అంటూ మనుక్రాంత్ గతంలోనే జనసేనకు రాజీనామా చేసి బయటకు వచ్చేశారు. ఆయన పవన్ కల్యాణ్ వ్యవహారశైలి నచ్చకనే జనసేన నుంచి బయటకు వచ్చినట్లు ప్రకటించారు. తాజాగా ఆయన జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. మనుక్రాంత్‌తో పాటు, జనసేన నేతలు కాటంరెడ్డి జగదీష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ యాదవ్, టీడీపీ నేత చేజర్ల సుబ్బారావు, కాంగ్రెస్ నేతలు పంతం నెహ్రూ, ఇందిర వైసీపీలో చేరారు. ఇదిలా ఉంటే ఎన్నికల ముందు జనసేన నుంచి పెద్ద ఎత్తున నాయకులు బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కేవలం 21 స్థానాల్లో మాత్రమే జనసేన పోటీ చేయడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ 21 స్థానాల్లో కూడా వేరే పార్టీల నుంచి వారికి టికెట్లు కేటాయించడంపై జనసేనలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. జనసేన పార్టీలో టికెట్ దక్కని నేతలు బహిరంగంగానే తమ ఆక్రోశాన్ని వెళ్ళగక్కుతున్నారు. పవన్ వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు చేస్తూ జనసేన నాయకులు పార్టీకి రాజీనామా చేస్తున్నారు. ఇప్పటికే పరుచూరి భాస్కరరావు, పితాని బాలకృష్ణ , పోతిన మహేష్, శెట్టిబత్తుల రాజబాబు, మాకినీడి శేషుకుమారి వంటి నాయకులు జనసేనకు రాజీనామా చేశారు.

## పురందేశ్వరి సహా రెండో రోజు ప్రముఖుల నామినేషన్లు



అమరావతి : ఆంధ్రప్రదే శ్‌లో రెండో రోజు నామినేషన్ల పర్వం సంద డిగా సాగింది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ర్యాలీగా వెళ్లి నామపత్రాలు సమర్పిం చారు. చిత్తూరు జిల్లా కుప్పంలో తెదేపా అధినేత చంద్రబాబు తరపున ఆయన సతీమణి భువనేశ్వరి, హిందూ పురంలో నందమూరి బాలకృష్ణ (తెదేపా), రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి (భాజపా) నామినేషన్ దాఖలు చేశారు. కొండపి తెదేపా అభ్యర్థిగా డోలా బాలవీరాం జనేయ స్వామి, తాడేపల్లిగూడెం నుంచి బొలిశెట్టి శ్రీనివాస్ (జనసేన), యర్రగొ ండపాలెంలో గూడూరు ఎరిక్సన్ (తెదేపా), కావలిలో కావ్య కృష్ణారెడ్డి (తెదేపా), నెల్లూరు గ్రామీణం నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (తెదేపా), విజ యవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గద్దె రామ్మోహన్ (తెదేపా) తరఫున ఆయన సతీమణి అనూరాధ, గుంటూరు జిల్లా తాడికొండ నియో జకవర్గం నుంచి తెనాలి శ్రావణ్ కుమార్ (తెదేపా), మంగళగిరి నియోజకవర్గం నుంచి మురుగుడు లావణ్య (వైకాపా) నామినేషన్ పత్రాలు సమర్పించారు. పాలకొల్లులో తెదేపా అభ్యర్థి నిమ్మల రామానాయుడు సైకిల్‌పై వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.

## జగన్ ను జైల్లో పెట్టావ్.. పుట్టపర్తి సాయిబాబా సంపదంతా దోచుకున్నావ్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఎన్నికల సమయంలో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది. నిన్న కిరణ్ కుమార్ రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఏపీలో పెను దుమా రంగా మారాయి. కిరణ్ కుమార్ రెడ్డిపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోనియా గాంధీ కాళ్లు పట్టుకొని ముఖ్యమంత్రి పదవి తెచ్చుకున్నాడని చేసిన వ్యాఖ్యలతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం మొదలైంది.

కిరణ్ కుమార్ రెడ్డికి పెద్దిరెడ్డి కౌంటర్ : దానికి కిరణ్ కుమార్ రెడ్డి డిసిసి అధ్యక్ష పదవి కోసంపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన కాళ్లు పట్టుకున్నాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో మాజీ సీఎం కిరణ్‌కు మంత్రి పెద్దిరెడ్డి కౌంటర్ వేశారు. నేను కాళ్లు పట్టుకున్నానని కిరణ్ అబద్ధాలు చెప్పారని మండిపడిన ఆ యన, నేను కాంగ్రెస్‌లో సోనియాగాంధీ కాళ్లకే మొక్కలేదు.. చిదంబరం కాళ్లు పట్టుకొని కిరణ్ సీఎం అయ్యారు అంటూ మళ్ళీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ సీఎం గా పని చేసి బీజేపీ నుండి పోటీ సిగ్గు చేటు : కాంగ్రెస్‌ను మాజీ సీఎం కిరణ్ సర్వనాశనం చేశారని నిప్పులు చెరిగారు.. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రిగా పనిచేసి.. బీజేపీ నుంచి పోటీ చేయడం సిగ్గుచేటు అంటూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శలు గుప్పించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి బ్రతికున్నన్ని రోజులు ఆయనతో సన్నిహితంగా ఉన్నారని, మరణించిన తర్వాత రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. కిరణ్ కుమార్ రెడ్డి ఇప్పుడొచ్చి వాగుతున్నాడు అని మండిపడ్డారు.

పుట్టపర్తి సాయిబాబా సంపద దోచింది నిజం కాదా : జగన్ ను జైల్లో పెట్టింది కిరణ్ కుమార్ రెడ్డి కాదా చెప్పాలంటూ ప్రశ్నించారు. వైయస్ జగన్ ను అరెస్టు చేస్తానని, రాష్ట్ర విభజనకు సహకరిస్తానని చెప్పి చిదంబరం కాళ్లు పట్టుకున్నారని అందుకే ఆయన ముఖ్యమంత్రి అయ్యాడని విమర్శించారు. పుట్టపర్తి సాయిబాబా చనిపోతే 10 రోజులపాటు అక్కడే భౌతికకాయాన్ని ఉంచి, బ్రతికి ఉన్నారని చెప్పి ఆయన సంపదనంతా దోచుకుంది నిజం కాదా అంటూ సంచలన ఆరోపణలు చేశారు.

ఏపీ ప్రజలను మోసం చేసిన ద్రోహి : తాను తెలంగాణ వాడినని అసెంబ్లీ సాక్షిగా చెప్పారని ఆఖరి బాల్ నాదేనని చెప్పి ఏపీ ప్రజలను మోసం చేసిన ద్రోహి కిరణ్ కుమార్ రెడ్డి అని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిప్పులు చెరిగారు. సమైక్యాంధ్ర పార్టీ పెట్టి మెడలో చెప్పులేసుకుని తిరిగిన ఇలాంటి ద్రోహికి ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాకుండా తరిమి కొట్టాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు.

## రాష్ట్రాన్ని జగన్ అప్పుల కుప్పగా మార్చారు: చంద్రబాబు



ఆలూరు: ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్‌ను మార్చే ఎన్నికలని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. కర్నూలు జిల్లా ఆలూరులో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏబీసీడీ వర్గీకరణ తెచ్చి మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని జగన్..రూ. 13లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చి, ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్నారు.. తెచ్చారా? అని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి రాగానే.. స్థానిక సంస్థలకు ప్రాధాన్యవి స్తామని, గ్రామాల్లో సర్పంచ్‌లకే అధికారం ఉంటుందని హామీ ఇచ్చారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమేనని, కేంద్రం సహకారం కూడా రాష్ట్రానికి అవసరమన్నారు. ''వైకాపా పాలనలో ప్రజల ఆదాయం పెరిగిందా? విద్యపై పెట్టిన ఖర్చు ఎంత? వచ్చిన ఫలితాలేంటి? వైకాపా నేతలు దోచింది ఎంత? దాదుచుకున్నది ఎంత? రాష్ట్రంలోనే అత్యంత ధనికుడు జగన్. ఇష్టానుసారం భూములు దోచుకున్నారు. జగన్ చేసే పనులకు.. చెప్పే మాటలకు పొంతన ఉందా? రాయలసీమకు ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా ఇవ్వలేదు. ఒక్క పరిశ్రమ తెచ్చారా? ఒక్క ఉద్యోగం ఇచ్చారా? ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా పేదల ఆరోగ్యాలతో ఆడుకునే పరిస్థితి వచ్చింది'' అని చంద్రబాబు మండిపడ్డారు.

# ఎడిటోరియల్

## ప్రమాదపుటంచున...

ఇప్పటి దాకా ముసుగులో గుద్దులాటగా ఉన్న వ్యవహారం బట్టబయలైంది. ఏప్రిల్ 13 రాత్రి ఇజ్రాయెల్‌పై ఇరాన్ పెద్దయెత్తున సాగించిన డ్రోన్, క్షిపణి దాడితో ఆ రెండు దేశాల మధ్య నాలుగు దశాబ్దాల పైగా లోలోపల సాగుతున్న కుమ్ములాట బయటపడింది. ముందుగా ఏప్రిల్ 1న సిరియా రాజధాని డెమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇజ్రాయెల్ జరిపిన దాడి, ఒక జనరల్ సహా పలువురు సైనికాధికారుల మృతితో అగ్గి రాజుకుంది. ప్రతీకారంగా గత శనివారం ఇరాన్ పంజా విసరడంతో వ్యవహారం ముదిరింది. యుద్ధం ఊసెత్తకపోయినా దెబ్బకు దెబ్బగా టెహరాన్‌పై తగిన చర్య చేపడుతామంటోంది టెల్ అవీవ్. అసలే అస్థిరతలో మునిగిన పశ్చిమాసియా ఈ శరవేగ పరిణామాలు, వ్యాఖ్యలతో ఏ క్షణమైనా పూర్తిస్థాయి యుద్ధంలో చిక్కుకుపోవచ్చు. చాలాకాలంగా ఇరాన్ తన వ్యూహాత్మక లక్ష్యాలకై పరోక్ష సహకారం అందిస్తూ ప్రాంతీయ తీవ్రవాద సంస్థలను ఇజ్రాయెల్ పౌరులపైన, వివిధ దేశాల్లోని ఇజ్రాయెల్ ఆస్తులపైన ప్రయోగిస్తూ వచ్చింది. అయితే, ఇజ్రాయెల్‌తో ఎన్నడూ నేరుగా ఘర్షణకు దిగలేదు. తెర వెనుక నుంచి తాను చేసినవి ఒప్పుకోనూ లేదు. ఇజ్రాయెల్‌దీ అదే పంథా. మూడేళ్ళ క్రితం ఇరాన్‌కు చెందిన ముగ్గురు అణుశాస్త్రవేత్తల హత్యలో తన పాత్రను ఆ దేశమూ అంగీకరించ లేదు, అలాగని ఖండించనూ లేదు. ఈ పరిస్థితుల్లో గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులతో గాజా భూఖండం సంక్షోభంలో పడింది. సదరు హమాస్ దాడుల వెనుక ఇరాన్ పాత్ర గురించి కథలు కథలుంటే, అదే అదనుగా పాలెస్తీనీయుల గాజాను ఇజ్రాయెల్ సమూలంగా ధ్వంసం చేసేసింది. ఐరాస సహా ఎవరెన్ని చెప్పినా నెలల తరబడి ఇజ్రాయెల్ ఆగలేదు, గాజాపై దాడులు ఆపనూ లేదు. ఈ నేపథ్యం నుంచి తాజా ఘటనల్ని చూడాలి. చివరకిప్పుడు ఇరాన్ నేరుగా తన గడ్డ మీద నుంచే ఇజ్రాయెల్‌పై దాడికి దిగింది. కొన్ని దశాబ్దాలుగా పశ్చిమాసియాలో ఎన్నడూ లేనంతటి ఉద్రిక్తతను పెంచింది. ఇరాన్ ప్రయోగించిన 360 క్షిపణుల్లో చాలావాటిని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జోర్డాన్‌ల సహకారంతో ఇజ్రాయెల్ నిలువరించగలిగింది. రాయబార కార్యాలయంపై దాడికి ప్రతిగా స్వీయ రక్షణ కోసమే తాము దాడి చేశామనీ, విషయం ఇంతటితో ముగిసిందనీ ఇరాన్ అంటోంది. ఇక, క్షిపణి దాడిని సమర్థంగా అడ్డుకున్నందున సంయమనం పాటించి, పరిస్థితి ప్రాంతీయ యుద్ధానికి దారి తీయకుండా చూడాలని అమెరికా సహా ఇతర మిత్రదేశాలు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను అభ్యర్థిస్తున్నాయి. ఇజ్రాయెల్ సరేనన్నట్టు ఉంటూనే, ఇరాన్‌కు తగిన బదులిస్తామంటోంది. ఏమైనా ఇరాన్, ఇజ్రాయెల్‌లు దేనికదే మధ్యప్రాచ్యంలో తమదే పై చేయి అని చూపేందుకు యత్నిస్తున్నాయి. అందులో భాగమే రెండు దేశాలూ ఇప్పుడు దాదాపు నేరుగా కయ్యానికి దిగడం! పశ్చిమాసియాలో పరిస్థితికి ఇరు దేశాల బాధ్యతా ఉంది. ఇజ్రాయెల్ నిస్సిగ్గుగా పాలెస్తీనా భూభాగాల్ని బలవంతాన దిగ్బంధించి, కథ నడుపుతుంటే ప్రపంచపు పెద్దన్నలెవరూ ఎన్నో ఏళ్ళుగా పెదవి విప్పలేదు. పట్టించుకోకుండా వదిలేశారు. నిరుడు హమాస్ దాడితో ఇజ్రాయెల్ అహం దెబ్బ తిని, గాజాలో సామూహిక ఊచకోతకు దిగినప్పుడూ అమెరికా సహా ఎవరూ దాన్ని ఆపలేక పోయారు. ఇరాన్ సంగతికొస్తే, అదీ ఇష్టానుసారం వ్యవహరించింది. హెజ్బుల్లా, హమాస్, హౌతీల లాంటివన్నీ అది పరోక్షంగా పోషిస్తున్న పాములే. కొన్నేళ్ళుగా ఇరాక్, లెబనాన్, సిరియా, యెమన్ లలో ఇరాన్ పరోక్ష సహకారంతో నడుస్తున్న ప్రాంతీయ తీవ్ర వాద మూకలను నిలువరించడమే ఇజ్రాయెల్, అమెరికాల పని అయింది. వెరసి, ఇరాన్, ఇజ్రాయెల్‌ల తప్పిదాలు, స్వార్థంతో పక్కన చేరిన దేశాలతో పశ్చిమాసియా చిక్కుల్లో పడింది. తాజా ఘటనలతో యుద్ధం అంచున నిల్చుంది. ప్రతి యుద్ధం ప్రపంచంలో అనిశ్చితిని పెంచేదే. మరీ ముఖ్యంగా, ప్రపంచానికి ఇంధన భాండా గారం లాంటి పశ్చిమాసియా యుద్ధక్షేత్రంగా మారితే ఇక చెప్పేదేముంది! తీవ్ర పరిణామాలు తప్పవు. ఇరాన్ – ఇజ్రాయెల్‌ల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంతో ప్రస్తుతం ప్రపంచమంతటా ఉత్కంఠ నెలకొన్నది అందుకే! వ్యవహారాన్ని తెగేదాకా లాగి, ప్రపంచం రెండు శిబిరాలుగా చీలితే కష్టం. ఇరాన్ దాడితో పని లేకుండా గాజాలో యుద్ధం కొనసాగిస్తామని ఇజ్రాయెల్ అంటోంది. అంటే, ఇరాన్ – ఇజ్రాయెల్ సంక్షోభం ముగియనే లేదని స్పష్టమవుతోంది. తక్షణమే అంతర్జాతీయ సమాజం బరిలోకి దిగి, ముందు గాజాలో దాడులు, పాలెస్తీనాలో అమాయక పౌరుల మరణాలు ఆగేలా చూడాలి. ఇజ్రాయెల్‌కు 66 శాతం మేర ఆయుధాలిస్తున్న అమెరికా, అలాగే ఇతర ఆయుధ సరఫరా దేశాలు తమ సరఫరాలు తగ్గించగలిగితే మేలు. అంతకంతకూ అంతర్జాతీయంగా తాను ఒంటరి అవుతున్నానని ఇజ్రాయెల్ గుర్తించాలి. 'అబ్రహామ్ ఒడంబడికల' ద్వారా మితవాద అరబ్ దేశాలు నెయ్యానికి ముందుకు రావడంతో దానికి కలి గిన ప్రయోజనం పోతుంది. అయినా, ఇంతకు ముందు, ఇకపైన కూడా మధ్య ప్రాచ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్‌లు రెండు ప్రధాన సైనిక శక్తులు. ఇరుపక్షాలూ లక్ష్మణరేఖ దాటాయి. వాటి మధ్య ఘర్షణ చివరకు యుద్ధంగా పర్యవసిస్తే అది రెంటికీ నష్టమే. కాబట్టి, మంకుపట్టు వీడి, వెనక్కు తగ్గాలి. ప్రస్తుత ఉద్రిక్తతను చల్లార్చాలి. పొంచివున్న పెను యుద్ధం ముప్పును నివారించాలి. పశ్చిమాసి యాలో ఉద్రిక్తతలు కొనసాగితే, ప్రపంచ చమురు సరఫరాలు సైతం అస్తవ్యస్తమై, ధరలు పెరుగు తాయి. రష్యా నుంచి చమురు సరఫరా కోసం ఎర్రసముద్రంపై ఆధారపడే మన దేశానికీ ఇబ్బందే. భారత్ సూచించినట్టు మళ్ళీ దౌత్యమార్గాన్ని ఆశ్రయించడమే అన్ని వివాదాలకూ పరిష్కారం.

# హైదరాబాద్, విజయవాడలో పెట్రోల్, డీజిల్ ధరలు

అమరావతి : కొద్ది రోజుల్లో ఎన్నికలు సమీపిస్తుండటంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వాహనదారులకు గుడ్ న్యూస్ ప్రకటించాయి. దేశవ్యాప్తంగా ఉన్న పెట్రోల్, డీజిల్ ధరలపై రూ.2 తగ్గిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. అయితే తగ్గిన ధరలు నేడు దేశవ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. దీంతో వాహనదారులు ఆనందపడుతున్నారు. అయితే నేడు ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో పెట్రోల్, డీజిల్ ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం.

హైదరాబాద్:లీటర్ పెట్రోల్ ధర– రూ. 107.66,లీటర్ డీజిల్ ధర– 95.82

విశాఖపట్నం:లీటర్ పెట్రోల్ ధర– 108.48,లీటర్ డీజిల్ ధర– 96.82

విజయవాడ:లీటర్ పెట్రోల్ ధర– 109.76,లీటర్ డీజిల్ ధర– 97.51

# హైదరాబాద్ విమానాశ్రయంలో ఏఏఐ వాటా విక్రయం?



హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తనకున్న వాటాను విక్రయించే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు దేశవ్యాప్తంగా తన ఆధీనంలో ఉన్న విమానాశ్రయాల్లో కొన్నింటిని ప్రైవేటు పరం చేయడం, మరికొన్నింటిలో వాటా విక్రయించేందుకు కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. పార్లమెంటు ఎన్నికలు పూర్తయ్యాక ఇందుకు సంబంధించిన కార్యాచరణ మొదలవుతుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. విమానాశ్రయాల నుంచి ప్రయాణికుల రాకపోకలు, సరకు రవాణాను గణనీయంగా పెంచడంతో, దేశంలో మౌలిక సదుపాయాల రంగాన్ని అధిక వృద్ధి బాటలో ప్రవేశపెట్టటం లక్ష్యంగా ఈ నిర్ణయాలు ఉండబోతున్నాయని చెబుతున్నారు.

**జీఎంఆర్ గ్రూప్‌నకు 74% వాటా**

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జీఎంఆర్ గ్రూపు నిర్మించి, నిర్వహిస్తోంది. ఇందులో జీఎంఆర్ గ్రూపు వాటా 74% కాగా, మిగిలిన 26 శాతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి 13%, ఏఏఐకు 13% వాటా ఉన్నాయి. తన 13% వాటా విక్రయించడానికి ఏఏఐ సన్నద్ధం అవుతోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే, ఈ ఏడాది చివరిలోగా ఏఏఐ వాటా విక్రయం పూర్తవుతుందని అంటున్నారు. ఈ 13 శాతాన్ని జీఎంఆర్ గ్రూపు కొనుగోలు చేస్తుందా, లేక ఏదైనా ఇతర సంస్థ సొంతం చేసుకుంటుందా అనేది వేచి చూడాలి. ఈ వాటా విలువ రూ.1,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. కొంతకాలంగా ప్రయాణికుల రాకపోకలు, సరకు రవాణా విభాగాల్లో హైదరాబాద్ విమానాశ్రయం ఎంతో అధిక వృద్ధి సాధిస్తోంది. కొవిడ్–19 ముందు కంటే మించిన ట్రాఫిక్ ఈ విమానాశ్రయంలో నమోదవుతోంది. అందువల్ల హైదరాబాద్ విమానాశ్రయంలో ఏఏఐ వాటా సొంతం చేసుకోవడానికి వివిధ సంస్థలు పోటీ పడొచ్చు.

**బెంగళూరులోనూ..**

బెంగళూరు విమానాశ్రయంలో ఏఏఐకి ఉన్న 13% వాటానూ విక్రయించే అవకాశం ఉంది. ఆ విమానాశ్రయం గతంలో జీవీకే గ్రూపు నిర్వహణలో ఉండేది. జీవీకే చేతిలో ఉన్న 64% వాటాను ఫెయిర్‌ఫాక్స్ ఇండియా హోల్డింగ్స్ కొనుగోలు చేసింది. ఆ విమానాశ్రయంలో సీమెన్స్ ప్రాజెక్ట్ వెంచర్స్‌కు 10%, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం, ఏఏఐ లకు చెరి 13% వాటాలున్నాయి.

**ప్రైవేటీకరణ జాబితాలో తిరుపతి?**

దేశవ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ అజమాయిషీలో ఉన్న 10–13 విమానాశ్రయాలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తారని తెలుస్తోంది. ఇండోర్, రాయ్‌పూర్, వారణాసి, హుబ్లీ, జబల్‌పూర్, తిరుపతి, కాంగ్రా తదితర విమానాశ్రయాలూ ప్రైవేటు పరం కావచ్చని అంటున్నారు.

**2025కు రూ.20,000 కోట్ల సమీకరణ లక్ష్యంగా**


విమానాశ్రయాల ప్రైవేటీకరణ, విమానాశ్రయాల నిర్వహణ కంపెనీల్లో వాటాల విక్రయానికి సంబంధించి నేషనల్ మోనిటైజేషన్ ప్లాన్ (ఎన్ఎంపీ)ను మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రక్రియ ద్వారా 2025 కల్లా రూ.20,000 కోట్లకు పైగా నిధులు సమీకరించాలన్నది యోచన. ప్రభుత్వ అజమాయిషీలో ఉన్న విమానాశ్రయాలతో పోలిస్తే, ప్రైవేటు సంస్థల ఆధీనంలోని విమానాశ్రయాలు అధిక వృద్ధిని నమోదు చేస్తున్నాయనే పేరిట, ప్రైవేటీకరణ చేస్తున్నారు. దేశంలో అత్యంత రద్దీ నమోదయ్యే, అత్యంత లాభదాయకమైన దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ వంటి విమానాశ్రయాలు ప్రైవేటు సంస్థల చేతిలో ఉన్నాయి. చెన్నై, కోల్‌కతాతో పాటు తక్కువ రద్దీ ఉండే ద్వితీయ శ్రేణి నగరాల్లోని విమానాశ్రయాలే ప్రభుత్వ నిర్వహణలో ఉన్నాయి. కాబట్టి సహజంగానే ప్రైవేటు అజమాయిషీలోని విమానాశ్రయాల్లో అధిక వృద్ధి కనిపిస్తోంది. వీటిల్లో ప్రయాణికుల నుంచి వసూలు చేసే యూడీఎఫ్ (వినియోగదారు అభివృద్ధి రుసుం) కూడా ఎక్కువగానే ఉండటం గమనార్హం. ప్రైవేటు సంస్థలకు విమానాశ్రయాలు అప్పగిస్తే, ఆధునికీకరణకు తోడు సమర్థ నిర్వహణ ఉంటుందని, తద్వారా విమానాలు, ప్రయాణికుల రాకపోకలు వేగంగా పెరిగే అవకాశం ఉంటుందన్నది నిపుణుల విశ్లేషణ. అందుకే ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియ మొదలవుతుందని అంచనా వేస్తున్నారు.

# సక్సెస్‌కు చిరునామా ఈ అంధుడే.. చూపులేకపోయినా ప్రపంచాన్ని శాసిస్తున్న శ్రీకాంత్



అమరావతి : మనిషి నుంచి ఎవరూ దొంగిలించలేనిది ఏదైనా ఉంటే అది జ్ఞానం, నైపుణ్యం. ఈ స్టేట్‌మెంట్ నిజమనేలా యువ పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లా ఒక ఉదాహరణగా నిలిచాడు. శ్రీకాంత్ మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూఎస్‌ఏలో చదివిన మొదటి అంతర్జాతీయ అంధ విద్యార్థి. దృష్టి లోపం కారణంగా శ్రీకాంత్ బొల్లా అనేక సవాళ్లను ఎదుర్కొన్నాడు. అవన్నీ అధిగమించి హైదరాబాద్‌కు చెందిన బొల్లాంట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సహ వ్యవస్థాపకుడు, చైర్మన్, సీఈఓఅయ్యాడు. అతని కెరీర్‌లో అతని అసాధారణ విజయం అతనికి అనేక ప్రతిష్టాత్మక అవార్డులు, గుర్తింపును సంపాదించిపెట్టింది. ముఖ్యంగా అతని పేరు "30 అండర్ 30" ఫోర్బ్స్ ఆసియా జాబితాలో చోటు సంపాదించాడు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ గురించి వివరాలను తెలుసుకుందాం. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలోని సీతారాంపురంలో జన్మించిన శ్రీకాంత్ బొల్లా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబంలో దృష్టి లోపంతో జన్మించాడు. పదో తరగతి తర్వాత అతను సైన్స్ స్ట్రీమ్‌ను ఎంచుకోవాలనుకున్నాడు. కానీ దానికి అనుమతి రాకపోవడంతో అతను కోర్టులో కేసు దాఖలు చేశాడు. ఆరు నెలల తర్వాత అతను న్యాయ పోరాటంలో గెలిచి సైన్స్ సబ్జెక్ట్ ఇంటర్ చదవడానికి అనుమతి వచ్చింది. ఇంటర్‌లో 98 శాతం మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. అతని అత్యుత్తమ ఫలితాలు ఉన్నప్పటికీ అతని బలహీనత కారణంగా కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం నిరాకరించారు. ఐఐటీ–జేఈఈ ఉత్తీర్ణత సాధించి, ఇంజినీరింగ్ చదవడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో చేరాలన్న అతని కల నెరవేరలేదు. కానీ అతను యూఎస్– ఎంఐటీలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థల్లో గ్రాడ్యుయేట్ అయ్యాడు. శ్రీకాంత్ 2011లో సమన్వాయి సెంటర్ ఫర్ చిల్డ్రన్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్‌ను సహ–స్థాపించారు, అక్కడ అతను బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్‌ను ప్రారంభించాడు. ఈ కేంద్రం విద్యార్థులకు విద్య, వృత్తిపరమైన, ఆర్థిక, పునరావాస సేవలను కూడా అందించింది. అంధులు ఆర్థికంగా స్వతంత్ర జీవితాలను గడపడానికి వారికి సహాయం చేస్తుంది. మరుసటి సంవత్సరం అతను బొల్లాంట్ ఇండస్ట్రీస్‌ను ప్రారంభించాడు. ఇది అరేకా–ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తుంది. రతన్ టాటా అందించిన నిధులతో పెట్టిన ఈ సంస్థ అనేక వందల మంది వికలాంగులకు ఉపాధిని అందిస్తుంది. ఈ కంపెనీ పర్యావరణ అనుకూలమైన రీసైకిల్ క్రాఫ్ట్ పేపర్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది మునిసిపల్ వ్యర్థాలు, ప్యాక్ చేసిన ఉత్పత్తులు, సహజమైన ఆకుల నుంచి పునర్వినియోగపరచదగిన ఉత్పత్తులు మరియు రీసైకిల్ చేయబడిన కాగితం, వ్యర్థ ప్లాస్టిక్‌లను ఉపయోగించేలా ఉత్పత్తులను తయారు చేస్తుంది. 2018లో కంపెనీ టర్నోవర్ రూ.150 కోట్లుగా ఉంది.

# ఎలుగుబంటి దెబ్బకు పరుగుపెట్టిన పెద్దపులి..



అమరావతి : ప్రస్తుతం అంతర్జాలం అందరికీ అందుబాటులో ఉండడం కారణంగా.. ప్రపంచం మొత్తంలో ఏ విషయం జరిగిన నిమిషాల వ్యవధిలో సోషల్ మీడియా ద్వారా అందరికీ ఇట్లే తెలిసిపోతుంది. ఇందులో ముఖ్యంగా ప్రతిరోజు ఎన్నో రకాల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతూ ఉంటాయి. అందులో కొన్ని ఫన్నీగా ఉంటే.. మరికొన్ని ఆలోచింపచేసేలా ఉంటాయి. మరికొన్ని భయభ్రాంతులకు లోనయ్యే విధంగా కూడా ఉంటాయి. ఇకపోతే తాజాగా ఎలుగుబంటి, పెద్దపులికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వీడియో సంబంధించిన విశేషాలు చూస్తే..మామూలుగా ఎక్కడైనా సరే అడవిలో జంతువులు పెద్దపులిని చూస్తే.. దాని దరిదాపుల్లో ఉండకుండా వెళ్ళిపోతాయి. అయితే ఒక ఎలుగుబంటి తప్ప. నిజానికి ఎలుగుబంటికి కోపం వస్తే ఎంతటి జంతువు అయినా సరే.. పక్కకి వెళ్లిపోవాల్సిందే. తాజాగా ఇలాంటి సంఘటన మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వ్ కోర్ ఏరియాలో చోటుచేసుకుంది. ఉన్నటువంటి ఓ ఎలుగుబంటి కి కోపం రావడంతో పెద్దపులిను సైతం పరుగులు పెట్టించింది. రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఓ కల్వర్టు పక్కన ఎండిన నీటిగుంటలో ఉన్న ఎలుగుబంటి వైపు వెళ్ళింది ఓ పెద్దపులి. అయితే ఏమైందో ఏమో తెలియదు గానీ.. సడన్ గా లేచి పెద్దపులి వైపు నడుచుకుంటూ వెళ్లింది. ఎదురుగా నిలబడి పెద్దపల్లి కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసింది. దాంతో దెబ్బకి ఒక్కొక అడుగు వెనక్కి వేసుకుంటూ పరుగులు పెట్టింది. ఈ సంఘటనకు సంబంధించి అక్కడ రిజర్వ్ ఫారెస్ట్ చూడడానికి వెళ్ళిన పర్యాటకులు వారి కెమెరాలు బంధించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా ఈ వీడియోని చూసేయండి.

# జక్కంపూడి రాజా సమక్షంలో వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలో చేరిన పెందుర్తి దేవదాస్

సీతానగరం:) మండలంలో మళ్ళీ జక్కంపూడే కావాలంటు జగనన్న ప్రభుత్వాన్నే కోరుకుంటోంది రాజానగరం నియోజకవర్గ ప్రజానీకం జక్కంపూడి రాజన్నని 45 వేల ఓట్ల మెజారిటీతో గెలిపిస్తాం అంటూ టిడిపి పార్టీ నుండి భారీ సంఖ్యలో పెందుర్తి దేవదాసు జక్కంపూడిరాజా ఆధ్వర్యంలో గురువారం రాత్రి చేరడంతో రాజానగరం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరొకసారి విజయం చేకూరే విధంగా కృషి చేస్తామని పెందుర్తి దేవదాస్ అన్నారు. అలాగే గత కాలం నుండి తాను టిడిపి పార్టీ ఉండి ఇటువంటి అభివృద్ధికి నోచుకోలేదని తన మండలం ప్రజలకు ఎటువంటి సహాయ సహకారాలుసహజ అందించ లేక పోయావని వైసీపీ పార్టీలో చేరి తమ పార్టీ తోపాటు తమ ప్రజలకు తమ శ్రేయోభిలాషులకు పార్టీ కార్యకర్తలకు మెరుగైన సేవలు అందించడానికి తాను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో. బైర్రాజు ప్రసాద్ రాజు, కరుటూరి శ్రీహరిబాబు గంటా శీను గుర్రం జోత్స్న ,పిచ్చుకల విజయ్ కుమార్ , పిచ్చుకుల రవి ,మద్దాల కొండలరావు, డాక్టర్ బాబు , వలవల వెంకటరాజు కొంచ భాస్కరరావు బాబు కొత్తరాజు

# రాజానగరం వైసిపి అభ్యర్థిగా నామినేషన్ వేసిన జక్కంపూడి రాజా



సీతానగరం,ఏప్రియల్ 19రాయల్ జర్నలిజం గత ఐదేళ్లుగా వివిధ పథకాలను నేరుగా ఇళ్లకే అందిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని కొనసాగిం చడానికి ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. ప్రత్యర్థుల మాయమాటలు, అబద్ధాలు నమ్మి మోసపోవద్దని ఆయన కోరారు. 2024జనరల్ ఎన్నికల్లో రాజానగరం నియోజక వర్గం నుంచి మరోసారి వైసిపి అభ్యర్థిగా రాజా శుక్రవారం ఉదయం రాజానగరం సాయిబాబా ఆలయంలో సతీసమే తంగా పూజలు నిర్వహించారు .అనంతరం ఎంపిడివో ఆఫీసులో నామినేషన్ దాఖలు చేసారు. మాట్లాడుతూ స్వర్గీయ జక్కంపూడి రామమోహనరావు, జక్కంపూడి విజయలక్ష్మి కుమారుడిగా 2019ఎన్నికల్లో పోటీ చేసినపుడు ప్రజలు ఎన్నో అశలు పెట్టుకుని గెలిపించినందుకు అనుగుణంగా నిత్యం ప్రజల్లో ఉంటూ ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని గుర్తుచేశారు. ప్రజల్లో తమ కుటుంబానికి గల మంచిపేరు నిలబెట్టుకోవా లన్న ఉద్దేశ్యంతో ఇచ్చిన మాట ప్రకారం పనిచేశానని అన్నారు. ఒక ఓటు వేస్తె ముగ్గురం పనిచేస్తామని చెప్పామని అందుకు అనుగుణంగా తాను,తన తమ్ముడు, అమ్మతో పాటు తన భార్య కూడా ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని,ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని ఆయన గుర్తుచేశారు. కరోనా సమయంలో గ్రామంలో తిరుగుతూ ఎవరికీ ఏ ఇబ్బంది వచ్చినా అడ్డుకున్నామని ఆయన అన్నారు. చిన్న గ్రామం మొదలుకుని నియోజక వర్గ స్థాయి వరకు ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే రాజా చెప్పారు. వివిధ శాఖలకు సంబంధించి 1773కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామని, అమ్మరో 1377 కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలు 20,178మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని,సీతానగరం, కోరుకొండ మండలాల్లో పొలాలకు సాగునీరు అందించామని ఆయన చెప్పారు. ఊరికి దగ్గరగా, నివాస యోగ్యంగా ఉండే విధంగా ఇచ్చిన స్థలాలపై సర్వ హక్కులు కల్పిస్తూ ఇంటి ఇల్లాలు పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తూ,ఇంటి ఇల్లాలి గౌరవం పెంచే విధంగా ఈ ప్రభుత్వం వ్యవహరించిందని ఆయన చెప్పారు. దొంగలు,దోపిడీ దారులు, హత్యలు చేసినవాళ్లు, మహిళల ను విదేశాలకు అమ్మేసినవాళ్లు తమ అక్రమ సంపాదనతో నిస్సిగ్గుగా ఎన్నికల్లో పోటీ చేస్తూ,ప్రజలకు డబ్బులు ఎరవేసి మభ్యపెట్టాలని చూస్తున్నారని,పైగా తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని రాజా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఒక రాజకీయ నేపథ్యం గల కుటుంబం నుంచి వచ్చిన తనకు ప్రత్యర్థుల అర్థం పర్థం లేని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ప్రజలే సరైన సమాధానం చెబుతారని ఆయన పేర్కొంటూ తనకు కనీసం 40 నుంచి 50 వేల మెజార్టీ ఇస్తారని అయన ధీమా వ్యక్తం చేసారు. మరోసారి వైసిపిని గెలిపించాల్సిన చారిత్రాత్మక అవసరాన్ని గుర్తించి ఓట్లు వేయాలని ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి జక్కంపూడి రాజశ్రీ, జక్కంపూడి గణేష్ సతీమణి సుకీర్తి,గంధం నారాయణరావు, ఆడిటర్ సుబ్రహ్మణ్యం,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనం జనం... ప్రభంజనం !!



## కోనాకు ప్రజల నీరాజనం!!

- వైభవంగా కోనా రఘుపతి నామినేషన్
- జనసంద్రంగా మారిన పుర వీధులు
- హర్షద్వానాలతో కోనా కు ప్రజల జేజేలు
- 20,000 మందికి పైగా పాల్గొన్న జనసంద్రం

రాయల్ జర్నలిజం, ( బాపట్ల ) ఏప్రిల్ 19 : బాపట్ల కు జరిగిన అభివృద్ధిని చూసి తనకు వోటు వేయాలని కోనా రఘుపతి అన్నారు. శుక్రవారం వైసిపి బాపట్ల నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి కోనా రఘుపతి మరియు పార్లమెంటు స్థానం అభ్యర్థి నందిగం సురేష్ లు తమ నామినేషన్ ధాఖలు పరిచారు. కోనా రఘుపతి పట్టణంలోని శ్రీనివాస దియేటర్ వద్ద గల సీతారామాంజనేయ రైస్ మిల్ వద్ద నుండి తన నామినేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఆ రైస్ మిల్ ఆవరణ మొత్తం కోనా సైన్యం తో కిక్కిరిసి పోయింది. వారితో కలిసి కోనా రఘుపతి సంభరాల్లో పాల్గొన్నారు. మేళ తాళాలతో, హర్షద్వానాలతో మరియు బాణా సంచాతో బాపట్ల పట్టణంలో ఒక పండుగ వాతావరణం నెలకొంది. ఆ ప్రాంతం నుండి ప్రారంభమైన కోనా ర్యాలి స్థానిక గడియార స్థంభం మీదుగా పాత బస్ స్టాండ్ సెంటర్ వద్దకు కోనా రఘుపతి మరియు నందిగం సురేష్ చేరుకున్నారు. ఈ ర్యాలి లో షుమారు 25,000 మంది ప్రజలు పాల్గొనగా వారిలో అధిక శాతం మహిళలు పాల్గొనడం





విశేషం. పాత బస్ స్టాండ్ వద్ద వారి అభిమానులు అభ్యర్దులిరువురికి గజ మాల వేసి ఘనంగా సత్కరించి వారి మద్దత్తు తెలిపారు. అనంతరం అక్కడి నుండి కోనా రఘుపతి తన నామినేషన్ ను స్థానిక మండల తహసిల్దార్ కార్యాలయం నందు తన నామినేషన్ ను దాఖలు పరిచారు. ఆయన వెంట నందిగం సురేష్, కోనా వెంకట్, కోనా నిఖిల్, మరియు కోనా రమాదేవి పాల్గొన్నారు. అదే విధంగా నందిగం సురేష్ తన నామినేషన్ ను స్థానిక కలక్టరేట్ నందు దాఖలు పరిచారు. కోనా రఘుపతి తిరిగి మూడవ సారి హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని, రానున్న కాలంలో రాష్ట్ర మంత్రి వర్గం లో చోటు సాధించుకోవడం తధ్యం అంటూ కోనా నామినేషన్ చుసిన పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ సందర్భంగా కోనా రఘుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ అయిదు సంవత్సరాల పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం అందించగలిగాం అన్నారు. రైతుల దగ్గర నుండి డ్రైవర్ల వరకు ప్రతి ఒక్కరి అభివృద్ధికి, సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. రైతులకు విత్తనం విత్తిన దగ్గర నుండి వారికి గిట్టుబాటు ధర కల్పించేంత వరకు భరోశా కల్పించేందుకు రైతు భారోశా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం కేవలం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వమేనన్నారు. అదే విధంగా బాపట్ల ను గతంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి చేసిన ఘనత తనదేనన్నారు. తాను చేయాలనుకున్న అభివృద్ధిలో భాగంగా పట్టణంలో విశాలవంతమైన రోడ్లను నిర్మించడం కేవలం ఒక భాగమేనని, రానున్న కాలం లో డ్రైనేజి వ్యవస్థ, కనక్టింగ్ రోడ్లతో పాటు పార్కు లను నిర్మించడం జరుగుతుందన్నారు. రాష్ట్రం మొత్తం బాపట్ల వైపు చూసే విధంగా ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. బాపట్ల ను జిల్లా గా చేసిన ఘనత కేవలం తనదేనని, ఎవరు ఎన్ని విమర్శలు చేసినా నిజం మారదన్నారు. ఆనాడు కోనా ప్రభాకర రావు మరియు ముప్పలనేని శేషగిరి రావుల కాలం లోని మెడికల్ కళాశాల కల నేడు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా 540 కోట్ల రూపాయల వ్యయంతో మెడికల్ కళాశాల మరియు ఆసుపత్రి నిర్మించి వైద్య సేవల్లో బాపట్ల కు సుస్థిర స్థానం ఏర్పడబోతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి తనకు వోటు వేసి తిరిగి మూడవ సారి గెలిపించి బాపట్ల నియోజకవర్గం ను అభివృద్ధి పధం లో నడిపించేందుకు తోడుగా నిలవాలన్నారు. అదే విధంగా బాపట్ల పార్లమెంటు స్థానానికి నందిగం సురేష్ కు వోటు వేసి తనను గెలిపించాలని కోరారు.



# ఎన్డీఏ అభ్యర్థుల విజయం ఖాయం

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి విజయానికి కృషి చేస్తాం
- రాజంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ మలిశెట్టి వెంకటరమణ
- రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తా సుగవాసి



రాయల్ జర్నలిజం ( రాజంపేట ) ఏప్రిల్ 19 : ఉమ్మడి కడప జిల్లా రాజంపేట జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ ఇంచార్జ్ మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్డీఏ అభ్యర్థుల ఆత్మీయ సమావేశం జరిగింది.ఈ కార్య క్రమానికి రాజంపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. భాజా భజంత్రీలతో భారీ గజమాలతో స్వాగతం పలికి శాలువాతో సన్మా నించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మలిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ,రాష్ట్రంలో రాక్షస పాలన అంతమవ్వాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం ఖాయం అని వెనుక బడిన రాజంపేటని ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.రాజం పేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, రాజంపేట నియోజకవర్గంలో తను జరుపుతున్న ప్రచారంలో ప్రజల ఆదరణను చూస్తుంటే వైకాపా పరిపాలన పైన ప్రజలు ఎంత అసమ్మతితో ఉన్నారో తెలుస్తుందన్నారు. తనను మెజారిటీతో గెలిపిస్తే మెడికల్ కాలేజీ వచ్చే విధంగా చూస్తానన్నారు.మొదటి లేదా రెండవ వార్షిక సంవత్సరాల్లో అన్నమయ్య ప్రాజెక్టును తగిన పూర్తి చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాజంపేటలో భూగర్భ జలాలు అడుగంటి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఎన్నికల్లో గెలిచిన తరువాత ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామన్నారు.రాజంపేట ను జిల్లా కేంద్రంగా మార్చడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో గీతాంజలి రమణ,యద్దల సాగర్, రాజంపేట టిడిపి మండల అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య, జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, జనసేన పార్టీ లీగల్ సెల్ కత్తి సుబ్బరాయుడు, భాస్కర్ పంతులు, లక్ష్మీనారాయణ, మనీ జయరామయ్య, గోపి, చౌడయ్య ఆచారి,అబ్బిగారి గోపాల్, జనసేన వీర మహిళలు శిరీష,సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు



రాయల్ జర్నలిజం (కాకుమాను) ఏప్రిల్ 19 : మండల కేంద్రం కాకుమోన్ గ్రామానికి చెందిన వాలంటీర్లు అందరూ శుక్రవారం తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు అందజేశారు. తమ రాజీనామా లేఖలను అందజేసిన అనంతరం మీడియాతో వాలంటీర్లు మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు సరైనవి కావంటూ, రానున్న ఎన్నికల్లో మరోసారి ప్రజాభివృద్ధి, సంక్షేమం జరగాలంటే మరోసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయవలసిన బాధ్యత మాపై, ప్రజలపై ఉంటుందని వాలంటీర్లు మాట్లాడారు.

# నామినేషన్ల ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలి

రాయల్ జర్నలిజం ( బాపట్ల ) ఏప్రిల్ 19 : చెడునడత కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్స్ పై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు ఏప్రిల్ 18వ తేదీ నుండి నామినేషన్ ల ప్రక్రియ మొదలైనందున ఏటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో రాజకీయ పార్టీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు ప్రక్రియ సజావుగా సాగేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది ఏప్రిల్ 19న శుక్రవారం రాజకీయ పార్టీల అభ్యర్థుల ర్యాలీలు నిర్వహించు మార్గంలో, ఆర్.ఓ కార్యాలయాల వద్ద పటిష్ట బందోబస్తు విధులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భద్రత ఏర్పాట్లను అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గురువారం నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనందున జిల్లాలోని ఆర్.ఓ కార్యాలయాల వద్ద విధులు నిర్వహించే పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఆర్.ఓ కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోకి అభ్యర్థికి సంబంధించిన మూడు వాహనాలను మాత్రమే





అనుమతించాలన్నారు. ఆర్.ఓ వద్ద నామినేషన్ దాఖలు చేయడానికి అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులను మాత్రమే కార్యాలయంలోకి అనుమతించాలన్నారు. అభ్యర్థులకు రక్షణగా వచ్చే ఆయుధాలు కలిగిన పి.ఎస్.ఓ లను సైతం ఆర్.ఓ కార్యాలయంలోకి అనుమతించరాదని, వారు కూడా కార్యాలయం బయటే వేచి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రాజకీయ పార్టీ లకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి ఆర్.ఓ కార్యాలయానికి ర్యాలీ లు గా వెళ్లే అవకాశం ఉంటే వారు సంబంధిత అధికారుల నుండి పొందిన అనుమతి పత్రాలను పరిశీలించాలన్నారు. ఏ రాజకీయ పార్టీ అభ్యర్థి అయిన అధికారుల నుండి సరైన అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీ అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించుకుంటూ వచ్చే సమయంలో సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 25వ తేది వరకు జరగనున్న నామినేషన్ ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. చెడునడత కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్స్ పై నిఘా ఉంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

# యానాదుల రాజకీయ ప్రాధాన్యత టిడిపి తోటే సాధ్యం



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) ఏప్రిల్ 19 : మండలంలోని కంకటపాలెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎస్టీ కాలనీలో నివసిస్తున్న యానాది కుటుంబాలను యానాది హక్కుల పోరాట సమితి అధ్యక్షులు తిరువీధుల శంకర్ ప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో మురుగు కాలువల దుస్థితిని, ఇళ్లు, స్థలాలు రాకపోవడం, లోన్లు అందకపోవటం, కరోనా టైంలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న వారికి ధైర్యం చెప్పారు. రాబోయే రోజుల్లో ఎన్ డి ఏ కూటమిని గెలిచి చంద్రబాబునాయుడు గారిని సీఎం అయితే, మనకు కార్పొరేషన్ ఇతర నామినేటెడ్ పదవులు, 90% సబ్సిడీతో లోన్ లు, ఇల్లు, ఇళ్ల స్థలాలు అన్నీ కాబట్టి ఐదు సంవత్సరాలలో జగనన్న ప్రభుత్వంలో యానాది కుటుంబాలకు ఎటువంటి లబ్ధి చేకూరలేదు, యానాది కార్పొరేషన్ ఇవ్వలేదు కాబట్టి మన మనము జనసేన టిడిపి బిజెపిల ఎన్డీఏ కూటమి మద్దతు తెలిపిన టిడిపి పార్టీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్ర వర్మ మరియు బాపట్ల ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్ కి ఓటు వేసి గెలిపించి నారా చంద్రబాబు సీఎంగా గెలిపించి యానాది కార్పొరేషన్ ఏర్పాటు, యానాదుల అభివృద్ధి తోడ్పడదామని యానాది హక్కుల పోరాట సమితి అధ్యక్షులు తిరువీధుల శంకర్ ప్రసాద్ కోరారు.

# వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలి

- అధిక ధరలకు శుద్ధ మంచి నీటిని విక్రయిస్తే చర్యలు తప్పవు
- ప్లాంట్ల వద్ద పరిసరాలు పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవు
- మున్సిపల్ కమీషనర్ వాసు బాబు
- జిల్లా ఆహార భద్రతా అధికారి డా. శమీమ్ భాష



రాయల్ జర్నలిజం ( రాయచోటి ) ఏప్రిల్ 19 : పట్టణంలోని ఆర్ఓ ప్లాంట్ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని మున్సిపల్ కమీషనర్ వాసుబాబు, జిల్లా ఆహార భద్రతా అధికారి డా. శామీమ్ భాష వాటర్ ప్లాంట్ యజమానులకు సూచించారు.పురపారిపాలన శాఖ ఉన్నతాధికారులు మరియు అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖ %డ%ఫుడ్ సెఫ్టీ అధికారులు సంయుక్తంగా మున్సిపల్ కార్యలయం నందు ఈ కార్యక్రమం నిరహించారు. ప్రతీ నెల తప్పనిసరిగా ఆర్ఓ ప్లాంట్ యజమానులు ప్రభుత్వ ల్యాబోట్రటరీ నందు నీటి శాంపిల్ పరీక్షలు నిర్వహించి రిపోర్ట్ తీసుకోవాలని సూచించారు. టిడిఎస్ ద్వారా నీటి పి.హెచ్ లెక్కగడతామని తెలిపారు. రేపటి నుండి పట్టణంలోని అన్ని ఆర్ఓ ప్లాంట్ ల నీటి శాంపిల్ ను సేకరించి తిరుపతి లోని ల్యాబ్ లకు పరీక్షల నిమిత్తం పంపనున్నట్లు తెలిపారు. రిపోర్ట్ ల ఆధారంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాంట్లు పరిశుభ్రమైన వాతావరణం లో అన్ని అనుమతులతో నిర్వహించుకోవాలని,నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తప్పవని,సీజ్ చేయడానికి వెనకాడబొమని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ డిఈ సుధాకర్ నాయక్, ఏఈ కృష్ణా రెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున,ఆహార భద్రతా సిబ్బంది సీతా రామయ్య, అన్ని వార్డు ఇంజనీరింగ్ కార్యదర్శులు, ఆర్.ఓ ప్లాంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# పెమ్మసానికి బ్రహ్మారథం పడుతున్న తెలుగు తమ్ముళ్లు



రాయల్ జర్నలిజం (కాకుమాను) ఏప్రిల్ 19 : రానున్న ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి గ్రామాల్లోని తెలుగు తమ్ముళ్ళు, మహిళల సైతం హారతులు ఇస్తూ బ్రహ్మరథం పడుతున్నారు. శుక్రవారం మండల పరిధి గ్రామాలైన కాకుమాను, అప్పాపురం, రేటూరు, కొండపాటూరు గ్రామాల యందు తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు ఇరువురు కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ అనంతరం మండల కేంద్రం కాకుమాను లో బహిరంగ సభ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో మహిళలు పార్టీ అభ్యర్థులకు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ సూపర్ 6 శంఖారావం ప్రాముఖ్యతను వివరించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును గెలిపించుకొని ముఖ్యమంత్రిని చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులకు ఉందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే పేద ప్రజలు అభ్యున్నతి కోసం తప్పక రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి పార్టీని గెలిపించవలసిందిగా కోరారు. ర్యాలీ కార్యక్రమంలో భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్న కారంచేడు గ్రామం



రాయల్ జర్నలిజం (కారంచేడు) ఏప్రిల్ 19 : కారంచేడు గ్రామంలో నిరంతరం కరెంటు కోతలతో, లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క భగ భగ మండుతున్న ఎండలు, మరో పక్క ఉక్క పోతతో ప్రజలు అల్లాడిపోతుంటే చిన్నపిల్లలు ఉన్నవారైతే నరకం అనుభవిస్తున్నామని అంటున్నారు. వేసవి కాలం విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండటం విద్యుత్ ఓవర్ లోడ్ వల్ల ట్రాన్స్ ఫార్మర్లు ట్రిప్పు అవ్వి విద్యుత్ అంతరాయం కలుగుతుంది. శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు కరెంటు పోవడంతో స్థానిక సబ్ స్టేషన్ కు ప్రజలు సమాచారం అందించిన విద్యుత్ అధికారులు సకాలంలో అందించలేదని కారంచేడు మండల హెడ్ క్వార్టర్ లో లైన్ మెన్ అందుబాటులో లేకపోవడం ఏమిటని గ్రామ ప్రజలు ప్రశ్నించగా విద్యుత్ సిబ్బంది కనీస స్పందన కరువైందని మండిపడుతున్నారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# వైఎస్ జగన్ పై వైఎస్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు

అమరావతి :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న వైఎస్ షర్మిల, ఏపీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని నిత్యం టార్గెట్ చేస్తూనే ఉన్నారు.ఏపీ ముఖ్యమంత్రిగా ప్రజలు అవకాశం ఇచ్చిన జగన్ రాష్ట్రాన్ని పట్టించుకోవడంలేదని, అటువంటి వ్యక్తి రాష్ట్రానికి అవసరమా అంటూ వైయస్ షర్మిల ప్రజలను ప్రశ్నించారు.ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిరలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్ షర్మిల జగన్ ఏరోజైనా ప్రజల సమస్యలను విన్నారా అంటూ ప్రశ్నించారు. పెద్ద పెద్ద కోటలు కట్టుకుని అందులో ఉండే ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఎన్నికల సమయంలో సిద్ధం పేరుతో బయటకు వస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్ కు, వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని షర్మిల పేర్కొన్నారు.వైయస్సార్ హయాంలో ప్రజాదర్బార్ ఉండేదని, ఆయన వారసుడి పాలనలో ప్రజా దర్బార్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వైయస్సార్ హయాంలో హంద్రీనీవా ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని, ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో జగన్ అధికారంలోకి వస్తే ఆ ప్రాజెక్టును పూర్తి చేసి 127 చెరువులకు నీరు ఇస్తామని చెప్పారని గుర్తుచేసి, కానీ ఆయన అధికారంలోకి వచ్చాక చేసింది శూన్యం అంటూ విమర్శించారు.జగన్ ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకు వస్తాను అన్నాడని, కానీ ఒక్క పరిశ్రమ కూడా తీసుకు రాలేదన్నారు. కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన జగన్ ప్రత్యేక హోదా హామీని మరిచిపోయారని షర్మిల విమర్శించారు. ఏపీలో నిరుద్యోగుల పరిస్థితి చెప్పనవసరం లేదన్నారు. జగన్ వారికి ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు.ఏపీకి ప్రత్యేక హోదా సంజీవని లాంటిదని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే వేలాది పరిశ్రమలు వచ్చేవని, జనాలకు ఉపాధి ఉండేదన్నారు. బిజెపి ఏపీ ప్రజలను మోసం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని వైఎస్ షర్మిల తేల్చి చెప్పారు.

# ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిపై సస్పెన్షన్ వేటు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిపై ఎన్నికల సంఘం సస్పెన్షన్ వేటు వేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అంతేగాక, హెడ్ క్వార్టర్స్ దాటి వెళ్లొద్దని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.కాగా, ఇటీవల వెంకట్రామిరెడ్డి కడప జిల్లా బద్వేలులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులతో సమావేశమై వైసీపీకి ఓటు వేయాలని ప్రచారం చేశారని తెలుగుదేశం పార్టీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలో ఈ వ్యవహారంపై కడప జిల్లా కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. వెంకట్రామిరెడ్డి పంచాయతీరాజ్ శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

**వైసీపీపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు**

వైసీపీ నేతలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి టీడీపీ ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో జరిగిన వివిధ అవకతవకల పై సీఈఓ కు ఫిర్యాదు చేశామని టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య తెలిపారు. వైసీపీ అధినేత, సీఎం జగన్మోహన్ రెడ్డి, వారి టీమ్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నీ ఇష్టానుసారం అతిక్రమిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పార్టీలు బరితెగించి ప్రవర్తించకూడదన్నారు. పోలీసులు కూడా బరితెగించి వ్యవహరిస్తున్నారని విమర్శించారు.సత్తెనపల్లిలో మహిళలను అత్యంత గౌరవంగా చూసే మంత్రి అంబటి రాంబాబు.. టీ కప్‌లపై రాంబాబు, ఎంపీ అభ్యర్థి అనిల్ యాదవ్ ఫోటోలు ముద్రించి, సత్తెనపల్లి లోని అన్ని టీ స్టాల్స్ కి ఇచ్చి, అందులోనే టీ పోసి అమ్మాలని చెబుతున్నారని సీఈఓకు ఫిర్యాదు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత మహానాయకుల ఫొటోలకే ముసుగు వేస్తే మీ ఫోటోలు వేసుకుంటారా? అని నిలదీశారు. టీడీపీ సానుభూతిదైన ఒక టీ షాప్ వ్యక్తి టీ కప్పులు తీసుకోనూ అంటే.. మా పోలీసులను పంపిస్తానని అంటారా? అని వర్ల రామయ్య మండిపడ్డారు.

# టీడీపీ అభ్యర్థుల మార్పు, ఎవరెక్కడ - రఘురామ పై తాజా నిర్ణయం..!



అమరావతి : ఏపీలో నామినేషన్లు మొదలయ్యాయి. ఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరింది. ఈ సమయంలో కూటమిలో సీట్ల సర్దుబాటు..టీడీపీలో పోటీ చేసే అభ్యర్థుల మార్పు పైన చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు.నలుగురు అభ్యర్థుల మార్పు ఖాయమైంది. రఘురామ రాజును ఉండి నుంచి బరిలోకి దింపాలని చంద్రబాబు నిర్ణయించారు. ఉండి అభ్యర్దిగా ప్రకటించిన రామరాజును పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించాలని నిర్ణయం తీసుకున్నారు.గతంలో ప్రకటించిన వారిలో నలుగురు అసెంబ్లీ అభ్యర్థులను తెలుగుదేశం పార్టీ మార్చింది. నరసాపురం సిటింగ్ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు అదే జిల్లా పరిధిలోని ఉండి అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేయనున్నారు. అక్కడ టీడీపీ తమ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజును ఇదివరకే ప్రకటించింది. ఆయనకు నచ్చజెప్పి పోటీ నుంచి విరమింపజేసే బాధ్యతను చంద్రబాబు తమ పార్టీ నేతలకు అప్పగించారు. ఈ క్రమంలో రామరాజును పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించాలని నిర్ణయించారు. అనకాపల్లి జిల్లాలోని మాడుగులలో కూడా టీడీపీ తమ అభ్యర్థిని మార్చింది.మాడుగులలో అంతకు ముందు ప్రవాసాంధ్రుడు పైలా ప్రసాదరావుకు సీటిచ్చారు. కానీ ఆయన క్షేత్ర స్థాయిలో ప్రచారంలో వెనుకబడ్డారని అధినాయకత్వానికి నివేదికలు అందాయి. దీంతో ఆయన్ను మార్చి సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర(ఎస్సీ)లో ప్రస్తుత అభ్యర్థి అనిల్ కుమార్‌ను మార్చాలని నిర్ణయించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి వర్గం గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఈ సీటును పార్టీ దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజుకు ఇవ్వనున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డిని కూడా మార్చబోతున్నారు.జయచంద్రారెడ్డి ప్రచార రంగంలో వెనుకబడిపోయారు. పైగా ప్రత్యర్థి శిబిరంతో ఆయనకు వ్యాపార సంబంధాలున్నాయన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. దీంతో అభ్యర్థిని మార్చాలని నిర్ణయం తీసుకున్నారు.ఏలూరు జిల్లా దెందులూరు అసెంబ్లీ స్థానంపై ఉత్కంఠ నెలకొంది. తమకు ఇచ్చిన అనపర్తి సీటును టీడీపీకి తిరిగి ఇవ్వాలంటే తమకు దెందులూరు ఇవ్వాలని బీజేపీ నాయకత్వం షరతు విధించింది. ఇంకో 3-4 స్థానాల్లో మార్పులు చేయాలని టీడీపీ నాయకత్వం యోచిస్తోంది. కడప జిల్లా కమలాపురం, తిరుపతి జిల్లా వెంకటగిరిలో పార్టీ ఇన్‌చార్జులకు బదులు వారి పిల్లలకు టికెట్లు ఇచ్చారు. ఈ రెండు చోట్లా తిరిగి వారి తండ్రులకే ఇస్తే బాగుంటుందని సూచనలు వచ్చాయి. దీంతో...మార్పుల పైన చంద్రబాబు తుది నిర్ణయం ఏంటనేది ఉత్కంఠ పెంచుతోంది.

# పవన్ కల్యాణ్ దూకుడు - తాజా నిర్ణయంతో..!



అమరావతి : ఏపీలో ఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరింది. ముఖ్య నేతలు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. కుప్పం నుంచి చంద్రబాబు ఈ రోజు నామినేష్ వేయనున్నారు. ఈ నెల 25న జగన్ పులివెందుల నుంచి..ఈ నెల 23న పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి నామినేషన్లకు ముహూర్తంగా నిర్ణయించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పవన్ కల్యాణ్ రేపటి నుంచి వరసగా ఏప్రిల్ 9వ తేదీ వరకు ప్రచార సభల్లో పాల్గొంటున్నారు. ఈ మేరకు పార్టీ అధికారికంగా షెడ్యూల్ ప్రకటించింది.

**23న నామినేషన్ :** జనసేనాని పవన్ రేపు (20వ తేదీ) పిఠాపురం నుంచి తన ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయనున్నారు. ఇప్పటి వరకు తొలి విడత ప్రచారం చేసిన పవన్...టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి కొన్ని సభల్లో పాల్గొన్నారు. ఈ నెల 23న పిఠాపురం నుంచి నామినేషన్ దాఖలు చేయనున్నారు. రోజుకి కనీసం రెండు సభల్లో పాల్గొనేలా ప్రణాళికలు రచించారు. టీడీపీ, బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో సైతం ఆయన ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. ఈ నెల 20న పిఠాపురం, రాజానగరం బహిరంగ సభ లో పవన్ పాల్గొంటారు. 21న భీమవరం, నరసాపురంలో పవన్ ప్రచార సభలకు ముహూర్తం నిర్ణయించారు.

**ప్రచార షెడ్యూల్ :** అదే విధంగా.. 22న తాడేపల్లెగూడెం, ఉంగుటూరులో పవన్ ప్రచారం చేయనున్నారు. 23న పిఠాపురంలో నామినేషన్, ఉప్పాడలో బహిరంగ సభలో పవన్ పాల్గొంటారు. 24న చంద్రబాబుతో కలిసి రాజంపేట, రైల్వే కోడూరు బహిరంగ సభలకు పవన్ హాజరు కానున్నారు. 25న టీడీపీ సభకు ఆ పార్టీ నేతలు ఆహ్వానించారు. 26న రాజోల్, రామచంద్రాపురంలో పవన్ ప్రచారం కొనసాగనుంది. 27న పెద్దాపురం, కాకినాడ రూరల్ లో జరిగే ప్రచార సభల్లో పాల్గొనాలని పవన్ నిర్ణయించారు. 28న జగ్గంపేట, పత్తిపాడు, అదే విధంగా 29న తిరుపతి. 30న పోలవరంలో పవన్ ప్రచారం చేయనున్నారు.

**చంద్రబాబుతో కలిసి :** మే నెలలో 1న ఎలమంచిలి, పెందుర్తి లో జరిగే సభల్లో పవన్ పాల్గొంటారు. 2న విశాఖపట్నం సౌత్ లో పవన్ ప్రచారం చేయనున్నారు. మే నెల 3న పాలకొండ, నెల్లిమర్ల లో పవన్ ప్రచారం ఉండనుంది. 4న తుని, పిఠాపురం లో పవన్ ప్రచార సభల్లో పాల్గొంటారు. 5న గుడివాడ , పామర్రు లో జరిగే సభల్లో పవన్ హాజరవుతారు. 6న రేపల్లె, అవనిగడ్డ లో సభలకు నిర్ణయించారు. 7న గన్నవరం, పెనమలూరులో జరిగే ప్రచారంలో పవన్ పాల్గొంటారు. 8, 9 తేదీలలో సమావేశాలు ఖరారు కావాల్సి ఉంది.

# ఓ ఇంట్లో తనిఖీలు చేసిన పోలీసులు.. అట్ట పెట్టెల్లో గుట్టు, పెద్ద ట్విస్టే ఇది!

అమరావతి :ప్రకాశం జిల్లాలో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్శి నియోజకవర్గం ముండ్లమూరులోని ప్రభుత్వ మద్యం షాపు నుంచి కారులోకి మద్యం కేసులు ఎక్కిస్తుండగా ఎస్ఈబీ సిబ్బంది దాడి చేసి 20 కేసులను పట్టుకున్నారు.కారు డ్రైవర్ శ్రీరామ్ కొండయ్యను అదుపులోకి తీసుకొని ఆరా తీయగా.. మండలంలోని పెదఉల్లగల్లు పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్‌కు తీసుకెళుతున్నట్లు చెప్పారు. ఆ ప్రాంతంలో నివాసం ఉండే ఈరంరెడ్డి మాలకొండారెడ్డి ఇంటిని తనిఖీ చేయగా 223 మద్యం కేసులు బయటపడ్డాయి.

# భారత వ్యతిరేకి.. మాల్దీవులు మాజీ అధ్యక్షుడు విడుదల




మాలే: చైనా అనుకూలవాది, భారత వ్యతిరేక విధానాలు అవలంబించిన మాల్దీవులు మాజీ అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ కు పడిన జైలుశిక్షను హైకోర్టు రద్దు చేసింది.ఆదివారం పార్లమెంటు ఎన్నికల వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. 2013-18 మధ్యకాలంలో అధికారంలో ఉన్న సమయంలో ఆయన అవినీతి, మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే అభియోగాలు ఉన్నాయి.పర్యటకం అభివృద్ధి కోసం ఒక చిన్న దీవిని లీజుకు ఇచ్చేందుకు ఓ ప్రైవేటు సంస్థ నుంచి లంచం తీసుకున్నట్లు ట్రయల్ కోర్టు గుర్తించింది. ఈ క్రమంలోనే 2002లో దోషిగా తేల్చి.. 11ఏళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో ఆయన జైలుకు వెళ్లారు. 2023లో తన స్నేహితుడైన మహమ్మద్ ముయిజ్జు గెలిచిన అనంతరం గృహ నిర్బంధానికి మారారు. విచారణలో లోపాలు ఉన్నాయంటూ తాజాగా ఈ శిక్షను హైకోర్టు పక్కన పెట్టింది. క్రిమినల్ విచారణను పునఃప్రారంభించాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. దీంతో ఆయన విడుదలయ్యారు.భారత్- మాల్దీవుల మధ్య దశాబ్దాలుగా కొనసాగిన ద్వైపాక్షిక మైత్రి 2013లో యమీన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక కుదుపులకు లోనైంది. చైనా నుంచి ఆయన భారీగా రుణాలు తీసుకున్నారు. భారత వ్యతిరేక విధానాలను అవలంబించారు. తీరప్రాంతాల్లో గస్తీ కోసం దిల్లీ స్నేహపూర్వకంగా అందించిన రెండు హెలికాప్టర్లను వెనక్కి ఇచ్చేశారు. స్థానికంగా విమానాశ్రయ ఆధునికీకరణ కాంట్రాక్టు దక్కించుకున్న భారతీయ కంపెనీని పక్కకు తప్పించి, చైనా సంస్థకు కట్టబెట్టారు.2018లో ఇబ్రహీం సోలిహ్ పాలన సమయంలో.. హిందూ మహాసముద్రంలో భారత్ సైనిక బలగాలను మోహరిస్తోందని ఆరోపిస్తూ యమీన్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు 'భారత్ వెళ్లిపోవాలి (ఇండియా ఔట్)' పేరుతో పెద్దయెత్తున దుష్ప్రచారం నిర్వహించాయి. 2019లోనూ ఆయన ఒకసారి జైలుకు వెళ్లి.. రెండేళ్ల తర్వాత బయటకు వచ్చారు.మాల్దీవులు ప్రస్తుత అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుకు సైతం చైనాకు అనుకూలుడిగా పేరుంది. దేశ పాలకుడిగా ఎన్నికైనప్పటినుంచి ఆయన కూడా భారత వ్యతిరేక ధోరణిని అవలంబిస్తోన్న విషయం తెలిసిందే. భారత్‌కు చెందిన భద్రతా బలగాలను తమ దేశం నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు.

# ఫిలిప్పీన్స్‌కి భారత బ్రహ్మోస్ క్షిపణులు..




అమరావతి : భారత్ తన బ్రహ్మోస్ క్షిపణులను ఫిలిప్పీన్స్‌కి ఎగుమతి చేయనుంది. ఫిలిప్పీన్స్ ఆర్డర్ చేసిన బ్రహ్మోస్ లాంచర్లను, క్షిపణులను రేపటి నుంచి సరఫరా చేయనుంది.మొదటి విడత బ్యాచ్‌ని శుక్రవారం డెలివరీ చేయనుంది. రక్షణ రంగంలో ఎగుమతులను పెంచుకునే భారత లక్ష్యంలో ఇది కీలక మైలురాయి. మరోవైపు దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ కంట్రీ చైనాను అడ్డుకునేందుకు బ్రహ్మోస్ క్షిపణులు అవసరమని ఫిలిప్పీన్స్ భావిస్తోంది.ఫిలిప్పీన్స్‌లోని పంపంగా ప్రావిన్స్‌లోని క్లార్క్ అంతర్జాతీయ విమానాశ్రయానికి భారత వైమానిక దళం కి చెందిన రెండు విమానాలు, కార్గో విమానాల ద్వారా డెలివరీ జరుగుతుందని రక్షణ, భద్రతా వ్యవస్థ వర్గాలు తెలిపాయి. క్షిపణి వ్యవస్థలో భాగంగా లాంచర్లు, వాహనాలు, లోడర్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో సహా అనేక ఉప వ్యవస్థలు ఇందులో భాగంగా ఉంటాయి.జనవరి 2022లో 374.96 మిలియన్ల ఒప్పందాన్ని ఫిలిప్పీన్స్, భారత్‌తో కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే భారత్ ఆ దేశానికి చెందిన ఒక దీవిలో స్టోరేజ్ బిల్డింగ్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. భారత రక్షణ రంగానికి సంబంధించి ఇదే మొదటి అతిపెద్ద అంతర్జాతీయ ఎగుమతి ఒప్పందం. ప్రస్తుతం ఫిలిప్పీన్స్‌కి ఎగుమతి చేస్తున్న బ్రహ్మోస్ పరిధి 290 కి.మీ. ప్రస్తుతం భారత్ సుదూర క్షిపణులను కలిగి ఉండగా.. ఫిలిప్పీన్స్‌కి డెలివరీ చేసేది షార్ట్ వెర్షన్.ఫిలిప్పీన్స్-చైనా మధ్య ఇటీవల కాలంలో ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ డెలివరీ జరుగుతోంది. ఇటీవల భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ఫిలిప్పీన్స్ వెళ్లి ఆ దేశానికి సంఘీభావం ప్రకటించారు. స్కార్‌బరో షోల్ మరియు స్ప్రాట్లీ దీవులు, ఫిలిప్పీన్స్ మరియు చైనాల మధ్య గత రెండు సంవత్సరాలుగా ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. బ్రహ్మోస్ ఇండియా-రష్యా జాయింట్ వెంచర్. ఈ క్షిపణి ధ్వని కన్నా మూడు రెట్ల(మాక్ 2.8) వేగంతో దూసుకెళ్తుంది. ప్రపంచంలో ఇప్పటి వరకు ఉన్న ఏకైక సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ బ్రహ్మోస్ మాత్రమే. ఇది కోస్టల్ డిఫెన్స్, గ్రౌండ్ అటాక్ రోల్స్ రెండిండిని నిర్వహించగలదు.

# జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో పగులుతున్న అద్దాలు.. అంతుచిక్కని అనుమానాలు



జూబ్లీహిల్స్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ల్లో ఆకతాయిలు రెచ్చిపోయారు.వాణిజ్య సముదాయాల అద్దాలను ధ్వంసం చేశారు. ఆయా దుకాణాల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కావాలనే కొందరు రాళ్లతో దాడి చేసి అద్దాలను ధ్వంసం చేస్తున్నారంటూ వారు అనుమానం వ్యక్తం చేశారు. నెల రోజులుగా జరుగుతున్న ఈ తతంగంపై పోలీసులు ఒకేసారి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు.  గత నెల 20న రాత్రి 7 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని బ్రూక్స్ బ్రదర్ స్టోర్ అద్దాలు ఒక్కసారిగా పగిలిపోయాయి. ఆ తర్వాత గంట వ్యవధిలో స్థానిక వాన్ హుస్సేన్ స్టోర్ అద్దాలు, ఆ పక్కనే ఉన్న వైట్ క్రో స్టోర్ అద్దాలు, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ 24 సెవన్ గ్రాసరీ స్టోర్‌కు సంబంధించిన అద్దాలు పగిలిపోయి గాజు ముక్కలు దుకాణాల్లో చిందరవందరగా పడిపోయాయి. దీంతో కొనుగోలుదారులు భయాందోళనకు గురయ్యారు.ఓ వ్యక్తికి స్వల్పంగా గాయమైంది. మరుసటి రోజు రాత్రి రోడ్‌నంబరు 2లోని ఆర్‌కే సినీప్లెక్స్(పీవీఆర్ మాల్)లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న అద్దాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ఆ తర్వాత కూడా ఈ మాల్‌లో రెండుసార్లు ఇదే ఘటన చోటుచేసుకుంది.  ఈనెల 4న రాత్రి బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని సూర్య సిల్క్ టెక్స్ క్రియేషన్ స్టోర్ అద్దాలు, 5న రాత్రి స్థానిక అండర్ ఆర్మర్ స్టోర్‌లోని భారీ అద్దాలపైకి రాళ్లు దూసుకురావడంతో ముక్కలయ్యాయి. ఇలా పదికిపైగా సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలపై ఆయా స్టోర్ల మేనేజర్లు ఈనెల 16న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటివరకు 8 కేసులు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికే ఇద్దరు క్యాబ్ డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

# భారీ బంగారం కంటెయినర్ మాయం కేసు.. నిందితుల్లో భారత సంతతి వ్యక్తులు



ఒట్టావా: 20 మిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన బంగారం, ఇతర వస్తువులతో ఉన్న కార్గో కంటెయినర్ ను గత ఏడాది టొరంటో అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కొందరు దుండగులు చోరీ చేసిన సంగతి తెలిసిందే.కెనడా చరిత్రలోనే ఈ అతిపెద్ద దోపిడీ కేసులో పోలీసులు ఆరుగురుని అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు భారత సంతతికి చెందిన వ్యక్తులు ఉన్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో మరో ముగ్గురికి వారెంట్లు జారీ చేశారు. గత ఏడాది ఏప్రిల్ 17న స్విట్జర్లాండ్ నుంచి వచ్చిన విమానం టొరంటో ఎయిర్‌పోర్టులో దిగింది. దానిలో 20 మిలియన్ కెడియన్ డాలర్ల విలువైన బంగారం, 2.5 మిలియన్ల విలువైన విదేశీ నగదు ఉందని అధికారులు వెల్లడించారు. దీంతో ఆ కంటైనర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించే క్రమంలో అదృశ్యమైంది. సరిగ్గా ఏడాది తర్వాత ఈ కేసులో పురోగతి కనిపించింది. బుధవారం ఆరుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్లు చెప్పారు. దోపిడీ సమయంలో వీరిలో ఒకరు ఆ దేశ విమానయాన సంస్థ ఎయిర్ కెనడాలో పని చేస్తున్నారు. అలాగే ఆ సంస్థకు చెందిన కొందరు సిబ్బంది సహకరించినట్లు తెలిపారు.కెనడా ఎయిర్‌పోర్టులో ఇంత భారీ చోరీ జరగడం ఇదే తొలిసారి కాదు. 1952లో టొరంటో ఎయిర్‌పోర్టులో అప్పట్లోనే 2.15 లక్షల డాలర్లు విలువైన బంగారం అపహరణకు గురైంది.

రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# పిఠాపురంలో జగన్ - పవన్ పై కొత్త స్కెచ్, కలిసొచ్చేనా..!



అమరావతి : ఏపీ ఎన్నికల రాజకీయం కీలక దశకు చేరింది. ముఖ్య నేతలు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్ర 18వ రోజు తూర్పు గోదావరిలో కొనసాగుతోంది.పవన్ ఈ నెల 23న పిఠాపురం లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ రోజు చంద్రబాబు కుప్పంలో నామినేషన్ దాఖలు చేస్తున్నారు. అధికారంలోకి రావటానికి కీలకమన గోదావరి జిల్లాల్లో జగన్ ఈ రోజు పవన్ పోటీ చేస్తున్న పిఠాపురంలో రోడ్ షో లో పాల్గొంటున్నారు.

**జగన్ బస్సు యాత్ర :** ముఖ్యమంత్రి జగన్ ఎస్ టీ రాజపురం రాత్రి బస నుంచి బయలుదేరారు. రంగంపేట, పెద్దాపురం బైపాస్, సామర్లకోట బైపాస్ మీదుగా ఉందురు క్రాస్ చేరుకొని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం ఉందురు క్రాస్, కాకినాడ బైపాస్ మీదుగా సాయంత్రం 3:30 గంటలకు కాకినాడ అచ్చంపేట జంక్షన్ వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం పిఠాపురం బైపాస్, గొల్లప్రోలు బైపాస్ , కత్తిపూడి బైపాస్ , తుని బైపాస్ , పాయకరావుపేట బైపాస్ మీదుగా గొడిచర్ల క్రాస్ రాత్రి బస శిబిరానికి చేరుకుంటారు. పవన్ పోటీ చేస్తున్న పిఠాపురం లో జగన్ రోడ్ షో నిర్వహించనున్నారు. ఇప్పటికే పిఠాపురం పైన జగన్ ముఖ్య నేతలకు దిశా నిర్దేశం చేసారు.

**పిఠాపురం పై ఫోకస్ :** పిఠాపురంలో వైసీపీ నుంచి వంగా గీత పోటీ చేస్తున్నారు. పార్టీ ముఖ్యులు గీతకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. పిఠాపురంలో గెలుపు ఖాయమని పవన్ భావిస్తుంటే..తామ అమలు చేసిన సంక్షేమం - సామాజిక సమీకరణాలు తమకు కలిసి వస్తాయని వైసీపీ అంచనా వేస్తోంది. రేపు పిఠాపురంలో పవన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. పవన్ పైన జగన్ కొత్త స్కెచ్ సిద్దం చేసారు. ఈ రోజు రాత్రి తాను బస చేసిన ప్రాంతంలో కాకినాడ పార్లమెంట్ పరిధిలోని అభ్యర్దులతో జగన్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. నేతల మధ్య సమన్వయం పైన కీలక సూచనలు చేయనున్నారు. ఈ నెల 25 తరువాత జగన్ ప్రతీ రోజు మూడు సభల్లో పాల్గొనేలా షెడ్యూల్ సిద్దం అవుతోంది.

**గోదావరి లో కొత్త స్కెచ్ :** జగన్ బస్సు యాత్రకు గోదావరి జిల్లాలో మద్దతు లభించింది. తణుకు, రావులపాలెం, జొన్నాడ, పొట్టిలంక మీదుగా కొనసాగింది. రావుల పాలెం సెంటర్ లో భారీగా జన స్పందన కనిపించింది. రాజమండ్రి నగరంలోనూ జగన్ యాత్రకు అనూహ్య స్పందన వచ్చిందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ రోజు కాకినాడ రూరల్ పరిధిలో జగన్ సభలో పాల్గొంటున్నారు. భీమవరం సభలో జగన్ తన హాయంలో చేసిన కార్యక్రమాలు, సంక్షేమం గురించి వివరించారు. పవన్ పైన విమర్శలు చేసారు. కాకినాడ పార్లమెంట్ నుంచి జనసేన అభ్యర్ది పోటీలో ఉన్నారు. పవన్ పిఠాపురం సైతం కాకినాడ పరిధిలోనే ఉంది. దీంతో, కాకినాడ పరిధిలో జగన్ యాత్రకు వచ్చే స్పందన, ప్రసంగం పైన ఆసక్తి కనిపిస్తోంది.

# నా కాళ్లు పట్టుకున్నావా లేదా ? పెద్దిరెడ్డికి ..కిరణ్ కుమార్ రెడ్డి ఘాటు కౌంటర్..!



అమరావతి : ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ముఖ్యంగా రాయలసీమ రాజకీయాల్లో చిరకాల ప్రత్యర్ధులైన రెండు కుటుంబాల మధ్య దశాబ్దాల తర్వాత మరోసారి మాటల యుద్ధం సాగుతోంది.ఇందులో ఒకరు మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అయితే మరొకరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. గతంలో నల్లారి, పెద్దిరెడ్డి కుటుంబాల మధ్య చిత్తూరు జిల్లాలో హోరాహోరీ పోరు సాగేది. ఆ తర్వాత ఇద్దరూ కాంగ్రెస్ పార్టీలో కలిసి పనిచేయాల్సి వచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఇద్దరూ వైసీపీ, బీజేపీలోకి వెళ్లిపోయారు. కానీ సైలెంట్ గానే ఉన్నారు. కానీ ఇప్పుడు ఎన్నికలు మళ్లీ వీరిద్దరి మధ్య చిచ్చు పెట్టాయి.రాజంపేట లోక్ సభ స్ధానానికి ఎన్డీయే ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి.. గతంలో ఇక్కడ రెండ్నుసార్లు గెలిచిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొడుకు మిధున్ రెడ్డితో తలపడుతున్నారు. దీంతో ఈ పోరు ఆసక్తికరంగా మారింది. తనయుడి తరఫున ప్రచారం చేస్తూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాజాగా కిరణ్ ను టార్గెట్ చేశారు. సోనియాగాంధీ కాళ్లు పట్టుకుని సీఎం పదవి తెచ్చుకున్నారని, జగన్ ను జైలుకు పంపారని తీవ్ర విమర్శలు చేశారు.దీనిపై కిరణ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. పదవుల కోసం తాను ఎవరి కాళ్లూ పట్టుకోలేదని, పదవుల కోసం ఆత్మగౌరవం చంపుకోవాల్సిన అవసరం తనకు లేదని కిరణ్ స్పష్టం చేశారు. అంతే కాదు గతంలో తన కాళ్లు పట్టుకున్న చరిత్ర పెద్దిరెడ్డిది అన్నారు. గతంలో డీసీసీ అధ్యక్ష పదవి కోసం గెస్ట్ హౌస్ కు వచ్చి పెద్దిరెడ్డి తన కాళ్లు పట్టుకున్న ఘటనను గుర్తుచేశారు. దీనిపై ఎక్కడైనా ప్రమాణం చేస్తానని సవాల్ విసిరారు. తద్వారా పెద్దిరెడ్డికే ఆత్మగౌరవం లేదని కిరణ్ గుర్తుచేశారు.

# సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల విధులపై కీలక నిర్ణయం..!



అమరావతి : ఏపీలో ఎన్నికల నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ఎన్నికల సంఘం సిబ్బంది, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పైన కీలక ఆదేశాలు జారీ చేసింది.ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలు అందాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓట్ ఫ్రం హెూమ్, పోస్టల్ బ్యాలెట్ కు సిబ్బంది సిద్దం అవుతున్నారు. ఇదే సమయంలో సచివాలయ సిబ్బందిని ఎన్నికల విధుల పైన కీలక నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులను ఎన్నికల విధుల్లో వినియోగించుకునేందుకు ఏర్పాటు జరుగుతున్నాయి. ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే వారిని కేవలం ఒపిఒలు (అదర్‌డెన్ పోలింగ్ ఆఫీసర్స్)గా మాత్రమే వినియోగించుకునేరదుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు కొంత మందికి శిక్షణ కూడా ఇస్తుండడంతోపాటు కార్యదర్శుల సామాజిక గ్రూపుల్లో దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. వాస్తవానికి ఉపాధ్యాయుల స్థానంలో వలంటీర్లను, కార్యదర్శులను పూర్తి స్థాయిలో ఎన్నికల విధుల్లో వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది.కానీ ,వలంటీర్ల వినియోగంపై ఎన్నికల కమిషన్, న్యాయ స్థానాలను అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లపై వెనకడుగు వేయాల్సి వచ్చింది. అయితే కార్యదర్శులు మాత్రం అధికారికంగా ఉద్యోగులుగా ఉండడంతో వారి సేవలను ఎన్నికల్లో ఉపయోగించుకునేందుకు నిర్ణయించిరది. అయితే పోలిరగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులను మాత్రమే వినియోగించుకురటూ గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులను సాధారణ విధులకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. కేవలం ఓటర్ల వేలుపై ఇంకు గుర్తు వేయడం, వారి ఓటర్ స్లిప్పులను ఓటర్ల జాబితాలో ఉన్నాయా లేదా అన్నది చూడడం వంటి అంశాలకు మాత్రమే వారిని పరిమితం చేయనున్నారు.

# రాజకీయ దిగ్గజాల కాళ్లు మొక్కిన టీడీపీ అభ్యర్ది నిమ్మల..!



అమరావతి : ఏపీలో నిన్న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్దులు జోరుగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కొక్కరు ఒక్కో విధంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళు తున్నారు.కొందరు భారీ ర్యాలీలతో వెళ్తుంటే, మరికొందరు ఎలాంటి హంగామా లేకుండా వెళ్లి నామినేషన్లు దాఖలు చేసి వస్తున్నారు. పలువురు ముహుర్తాలు చూసుకుని నామినేషన్లకు వెళ్తున్నారు. ఇదే క్రమంలో పాలకొల్లు సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్ది నిమ్మల రామానాయుడు మరోప్రయత్నం చేసారు.పాలకొల్లు ఎమ్మెల్యేగా వరుసగా రెండుసార్లు గెలిచిన నిమ్మల రామానాయుడు గత అసెంబ్లీలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా కూడా పనిచేశారు. కాపు సామాజిక వర్గానికి చెందిన రామానాయుడుకి జిల్లాలో మిగతా సామాజిక వర్గాల నేతలతో కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ మరోసారి పాలకొల్లు నుంచి పోటీకి నామినేషన్ వేసేందుకు వెళ్లే ముందు జిల్లాలో సీనియర్ రాజకీయ నేతల ఆశీస్సుల్ని ఆయన తీసుకున్నారు.కాపు,బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య, మాజీ మంత్రి, ఆచంట టీడీపీ అభ్యర్ది పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి( బాబ్జి), మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ లను రామానాయుడు స్వయంగా కలిసి పాదాభివందనం చేసి మరీ ఆశీస్సులు తీసుకున్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో విజయం సాధించేలా ఆశీస్సులు

# కెన్యాలో కుప్పకూలిన మిలిటరీ హెలికాప్టర్.. డిఫెన్స్ చీఫ్‌తో పాటు 9 మంది అధికారులు మృతి



నైరోబీ: కెన్యాలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆ దేశ డిఫెన్స్ చీఫ్ జనరల్ ఫ్రాన్సిస్ ఒమొండి ఒగొల్లా(61)తో పాటు తొమ్మిది మంది మిలిటరీ ఉన్నతాధికారులు చనిపోయారు.రాజధాని నైరోబీ నుంచి 400 కి.మీ దూరంలో ఉన్న మారుమూల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు అధ్యక్షుడు విలియం రూటో తెలిపారు. కెన్యా స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.20 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు వెల్లడించారు. తీవ్ర విచారంతో ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలో మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు.ప్రమాద వార్త తెలియడంతో జాతీయ భద్రతా కౌన్సిల్‌తో అధ్యక్షుడు రూటో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ప్రమాదానికి కారణాలు తెలుసుకోవడానికి దేశ ఎయిర్ ఫోర్స్ బృందం అక్కడికి బయలుదేరినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు దేశంలో సంతాప దినాలు పాటించాలని అధ్యక్షుడు ప్రకటించారు. పరాక్రమవంతులైన జనరల్స్, గాలంట్ అధికారులు, సర్వీస్ మెన్, ఒక మహిళా అధికారిని మాతృభూమి కోల్పోయినట్లు రూటో పేర్కొన్నారు. పైలట్ అయిన ఒగొల్లా ఏడాది మాత్రమే బాధ్యతలు చేపట్టారు. 40 ఏళుగా ఆయన మిలిటరీలో సేవలు అందిస్తున్నారు. గత 12 నెలల కాలంలో ఐదు కెన్యా మిలిటరీ హెలికాప్టర్లు కూలిపోయినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి.

# వెదురు పెంపకంతో భారీ ఆదాయం.. 50 శాతం సబ్సిడీ.. సాగు చేయడం ఎలా?



అమరావతి : దేశ జనాభాలో ఎక్కువ భాగం వ్యవసాయం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. వ్యవసాయం చేస్తే లాభం లేదనే అభిప్రాయం సర్వత్రా ఉంది. అయితే, ఇది సరైంది కాదు. అవగాహన ఉండి వ్యవసాయం చేస్తే అద్భుతమైన లాభాలు పొందవచ్చు.మీరు తక్కువ శ్రమతో వ్యవసాయం ద్వారా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనుకుంటే, మీరు వెదురు సాగు చేయవచ్చు. ఈ వ్యాపార ఆలోచన లాభదాయకమైన ఒప్పందంగా నిరూపితమైంది. దీని సాగుకు ప్రభుత్వం నుంచి రాయితీ కూడా లభిస్తుంది. మధ్యప్రదేశ్‌లోని శివరాజ్ ప్రభుత్వం వెదురు పెంపకానికి 50 శాతం వరకు సబ్సిడీని అందిస్తోంది. దీనిని ఆకుపచ్చ బంగారం అని కూడా అంటారు.

**వెదురుకు పెరుగుతున్న డిమాండ్**

దేశంలో వెదురు పండించే వారు చాలా తక్కువ. వెదురుకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. ఇతర పంటలతో పోలిస్తే వెదురు పెంపకం చాలా సురక్షితమైనదని నిపుణులు భావిస్తున్నారు. అంతే కాకుండా దీని ద్వారా మంచి ఆదాయం కూడా పొందవచ్చు. ఏ సీజన్‌లోనూ డిమాండ్ ఉంటుంది. వెదురు పంటను ఒకసారి నాటడం ద్వారా, మీరు దాని నుండి చాలా సంవత్సరాలుగా లాభాన్ని పొందవచ్చు. వెదురు సాగులో తక్కువ ఖర్చు, తక్కువ శ్రమ ఉంటుంది. బంజరు భూమిలో కూడా నాటవచ్చు.

**వెదురును ఎలా పండించాలి?**

ఏ నర్సరీలోనైనా వెదురు మొక్కలు కొనుగోలు చేసి నాటుకోవచ్చు. దాని సాగు కోసం భూమిని సిద్ధం చేయవలసిన అవసరం లేదు. నేల చాలా ఇసుకగా ఉండకూడదని గుర్తుంచుకోండి. 2 అడుగుల లోతు, 2 అడుగుల వెడల్పుతో గొయ్యి తవ్వి వెదురు నాటవచ్చు. దీని తర్వాత ఆవు పేడ ఎరువు వేయవచ్చు. నాటిన వెంటనే మొక్కకు నీరు పోయండి. ఒక నెలపాటు ప్రతిరోజూ నీరు తాగుట కొనసాగించండి. ఆరు నెలల తర్వాత వారానికి ఒకసారి నీరు పెట్టాలి. ఒక హెక్టారు భూమిలో 625 వెదురు మొక్కలను నాటవచ్చు. వెదురు మొక్క కేవలం మూడు నెలల్లో పెరగడం ప్రారంభమవుతుంది. వెదురు మొక్కలను ఎప్పటికప్పుడు కత్తిరించి కత్తిరించాలి. వెదురు పంట 3-4 సంవత్సరాలలో సిద్ధంగా ఉంటుంది. దేశంలో వెదురు వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం 2006-2007 సంవత్సరంలో జాతీయ వెదురు మిషన్‌ను ప్రారంభించింది.

**వెదురు ఉపయోగం**

ఈ పంటకు ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తోంది. కాగితం తయారు చేయడమే కాకుండా, ఆర్గానిక్ దుస్తులను తయారు చేయడానికి వెదురును ఉపయోగిస్తారు. దీనితో పాటు వెదురు అనేక అలంకరణ వస్తువులకు కూడా ఉపయోగిస్తారు.

**వెదురు నుండి సంపాదన**

వెదురు పంట 40 ఏళ్లుగా కొనసాగుతోంది. 2 నుండి 3 సంవత్సరాల కష్టపడి వెదురు వ్యవసాయం నుండి చాలా సంవత్సరాలు బంపర్ ఆదాయాన్ని సంపాదించవచ్చు. వెదురు సాగుతో నాలుగేళ్లలో రూ.40 లక్షలు సంపాదించవచ్చు. కోత తర్వాత కూడా అవి మళ్లీ పెరుగుతాయి. వెదురు చెక్కతో అనేక రకాల వస్తువులను తయారు చేయవచ్చు. ఇది మీ లాభాలను అనేక రెట్లు పెంచుతుంది. వెదురు సాగుతో పాటు నువ్వులు, ఉరద్, మూంగ్-గ్రామ్, గోధుమలు, బార్లీ లేదా ఆవాలు పంటలను కూడా పండించవచ్చు. దీంతో ఆదాయాలు పెరుగుతాయి.

# కొండ గొర్రెను అడవిలోకి వదిలిన అధికారులు



సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె గ్రామ సమీపంలోని పొలాల వద్దకు గురువారం మధ్యాహ్నం కొండ గొర్రె వచ్చి సమీపంలో ఉన్న బావిలో పడిపోయింది. గ్రామస్తులు అటవీ శాఖ రేంజర్ కళావతికి సమాచారం అందించారు.వెంటనే ఆమె సిబ్బందితో వచ్చి గ్రామస్తుల సహకారంతో బావిలో నుంచి ఆ కొండ గొర్రెను బయటికి తీశారు. రేంజర్ కళావతి మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో 4 సంవత్సరాల వయస్సు కలిగిన ఆడ కొండగొర్రె జంగాలపల్లె గ్రామ సమీపం లోని పొలాల వద్దకు తాగునీరు కోసం వచ్చి ప్రమాదవ శాత్తు బావిలో పడిందన్నారు. దానిని బయటికి తీసి సిద్దవటం బీటులోని సాబ్‌బావి అటవీ ప్రాంతంలోని సాసర్‌పీట్‌లో తాగునీరు తాపి అడవిలోకి వదిలామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేస్, ప్రొటక్షన్ వాచర్‌లు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# చైనా-పాకిస్తాన్‌కి వణుకే.. నిర్భయ్ క్షిపణి విజయవంతం..



అమరావతి : డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ గురువారం పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతో నిర్మితమైన నిర్భయ్ (ఇండీజినియస్ టెక్నాలజీ క్రూయిజ్ మిస్సైల్) క్రూయిజ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది.ఒడిశాలోని చండీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్టింగ్ రేంజ్ నుంచి ఈ మిస్సైల్ ప్రయోగం జరిగింది. ఈ లాంగ్ రేంజ్ సబ్ సోనిక్ క్రూయిజ్ పరీక్ష సమయంలో మిస్సైల్‌లోని అన్ని వ్యవస్థల్ని ట్రాక్ చేసి, సక్రమంగా పనిచేసినట్లు రక్షణ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. మిస్సైల్ గమనాన్ని నిర్ధారించడానికి రాడార్, ఎలక్ట్రో-ఆప్టికల్ ట్రాకింగ్ సిస్టమ్ మరియు టెలిమెట్రీ వంటి అనేక సెన్సార్ల ద్వారా క్షిపణి పనితీరును వివిధ ప్రాంతాల నుంచి పరిశీలించారు. క్షిపణి మార్గాన్ని వైమానిక దళానికి చెందిన %ాబ-30-Mk-I ఫైటర్ జెట్ నుంచి కూడా పర్యవేక్షించారు.క్షిపణి అనుకున్న విధంగానే సరైన మార్గంలో ప్రయాణించింది, సముద్రం మీదుగా తక్కువ ఎత్తులో ఎగిరింది. పరీక్ష సమయంలో నిర్భయ్ క్షిపణి గంటకు 864 కి.మీ నుండి 1111 కి.మీ వేగాన్ని సాధించింది. ఈ క్షిపణికి టెర్రైన్ హగ్గింగ్ సామర్థ్యం కూడా ఉంది. దీని వల్ల ఈ క్షిపణిని శతృదేశాలు కనుగొనడం కష్టం అవుతుంది. ఇది రెండు దశల్లో ఇంధనాన్ని వాడుతుంది. మొదటి దశలో సాలిడ్ ఫ్యూయల్, రెండో దశలో లిక్విడ్ ఫ్యూయల్‌ని వినియోగిస్తుంది. నిర్భయ్ క్షిపణి 300 కిలోల బరువున్న సంప్రదాయ ఆయుధాను మోసుకెళ్లగలదు. దీని గరిష్ట పరిధి 1500 కి.మీ. ఇది భూమి నుంచి 50 మీటర్ల నుంచి గరిష్టంగా 4 కి.మీ ఎత్తున ప్రయణిస్తూ టార్గెట్లను ధ్వంసం చేయగలదు. ఇది తన మార్గం, దిశను మార్చుకునే వ్యవస్థను కలిగి ఉంది. ఇది కదిలే లక్ష్యాలను కూడా నాశనం చేయగలదు. సముద్రం, భూమి పై నుంచి ఈ మిస్సైల్‌ని ప్రయోగించవచ్చు.ఈ మిస్సైల్‌తో భారత సైన్యం శక్తి మరింతగా పెరుగుతుంది. ముఖ్యంగా పాకిస్తాన్, చైనా వంటి దేశాలతో సరిహద్దు ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ క్షిపణిని భారత్-చైనా సరిహద్దు ఎల్ఏసీ వద్ద మోహరించాలని భావిస్తున్నారు. నిర్భయ్ పొడవు 6 మీటర్లు కాగా.. 0.52 మీటర్ల వెడల్పు, రెక్కల మొత్తం పొడవు 2.7 మీటర్లు కలిగి ఉంది. ఇది శతృదేశాల రాడార్లను కూడా ఏమార్చగలదు.


రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# Clear Congress strategy

